

ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు

# ఆరోగ్యభారతం

ప్రపంచ ఆరోగ్య సంస్థ ( డబ్ల్యూ హెచ్ ఓ) అధినేత టెడ్రోస్ అథనామ్ ఆ మధ్య మన గుజరాత్ వచ్చారు.అది...జామ్ నగర్ లో 'సంప్రదాయ వైద్య అంతర్జాతీయ కేంద్ర భవనం' నిర్మాణానికి శంకుస్థాపన జరిగిన సందర్భం .భారతీయుల సమగ్ర జీవన విధానానికి ప్రతిబింబాలైన మన వైద్య విధానాలపై టెడ్రోస్ ప్రశంసలు కురిపించారు.ఆయుర్వేదం మొదలు అనేక సంప్రదాయమైన చికిత్సా పద్ధతులు మన దేశాన్నిఎన్నో ఏళ్ళపాటు ఆరోగ్యంగా నిలిపాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా గుర్తుచేశారు.భారతీయ ప్రాచీన విజ్ఞాన సంపదను పరిరక్షించుకోవడం మన కర్తవ్యమని పలికారు.గుజరాత్ లో ప్రారంభమైనఆ ఆరోగ్యకేంద్రం ప్రపంచ మానవాళి మొత్తానికి ఉపయో గపడాలన్నది మన ప్రభుత్వం చేసుకున్న సంకల్పం.ఈ ఆశయం సంపూర్ణంగా ఆచరణలో సిద్ధించాలంటేమరో 25 ఏళ్ళు పడుతుందని ప్రధాని మాటలను బట్టి అర్థం చేసుకోవచ్చు.అనుకున్న ఫలితాలను రాబట్టగలిగితే సంప్రదాయ వైద్యంలోమరో శకం ఆరంభమవుతుందనిఅంచనా వేయవచ్చు.మన జీవనవిధానంలో తృణధాన్యాల పాత్ర విస్మరించ జాలనిది.ప్రధాని మోదీ కూడాఈ అంశాన్ని స్ఫుటంగా స్పృశించారు.భారతీయ సంప్రదాయవైద్య విధా నాలపై చర్చలు ఎప్పటి నుంచో జరుగుతున్నాయి కానీ, ఆచరణలో ఆమడదూరంలో ఉన్నాం. పరిశోధనలుపడకేశాయి.శిక్షణలు శూన్యం. నిధులు,వనరులు మృగ్యం. ఇటువంటి వాతావరణంలో,ఇప్పుడు ఈ కేంద్రం నిర్మాణానికిపునాదులు పడడం హర్షణీయం. ప్రభుత్వాలు ఇప్పటికైనా మేలుకుంటే మంచిది.జీవనశైలిని (లైఫ్ స్టైల్)మార్చుకుంటే ఆరోగ్యం బాగుంటుందనే మాటలుఈ మధ్యకాలంలో బాగా వినపడుతున్నాయి.జీవనశైలి అంటే జీవన విధానమే.పొద్దున నిద్రలేచినప్పటి నుంచిమంచం ఎక్కేంత వరకూ పాటించే నియమాల సమాగమమే జీవనవిధానం.శారీరక వ్యాయామం,మానసిక సాధన,ఆహార వ్యవహారాలు,ఆలోచనా సరళి,విశ్రాంతి,నిద్ర సమయాలు... ఇవన్నీ అందులోనే ఉన్నాయి.ఇవన్నీ సక్రమంగా ఉంటే,ఆరోగ్య సమస్యలు పెద్దగాదరి చేరవని ఆధునిక వైద్యులు కూడా చెబుతున్నారు.పూర్వులు చెప్పింది,పాటించింది కూడా అదే.నిద్ర,విశ్రాంతి సమయాలలో మార్పులు రావడంతో పాటు,ఆహార పద్ధతులు పూర్వానికి భిన్నంగా మారిపోయాయి. తృణధాన్యాల ఊసే లేకుండా పోయింది.ఇప్పుడిప్పుడే మళ్ళీ కొందరు ఆ దారిని వెతుక్కుంటున్నారు.2023 వ సంవత్సరాన్ని 'తృణధాన్యాల సంవత్సరం'గా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.ఆ నిర్ణయం వెనకాల భారత ప్రభుత్వ అభ్యర్థన ఉంది.ఈ ప్రాధాన్యతను ఐక్యరాజ్యసమితితో పాటు పలు దేశాలు కూడా ఇప్పుడు గుర్తిస్తున్నాయి.ఇది శుభపరిణామం.సంప్రదాయ వైద్య విధానాలకు పట్టంకడుతూ,తృణధాన్యాల పెంపకాన్ని,వాడకాన్ని పెరిగే విధంగా చూస్తూ ముందుకు సాగడం మన ప్రభుత్వాల ముందున్న తక్షణ కర్తవ్యం.పంచభూతాలను పరిరక్షించుకోకపోతే ఇవ్వేమీ ముందుకు సాగవన్న అంశాన్ని ముందుగా గుర్తించాలి.ఇందులో ప్రభుత్వాలతో పాటు పౌరుల బాధ్యత కూడా జతకలవాల్సి వుంది.తృణధాన్యాల పెంపకంలో అనువైన నేల,ఆరోగ్యకరమైన నీరు, సురక్షితమైన గాలిసమృద్ధిగా ఉండాలి.భూమిని నమ్ముకొని ముందుకు సాగే రైతులకు వ్యవసాయం లాభసాటిగా మారాలి. దోపిడీదారుల నుంచి రైతన్నలకు రక్షణ కల్పించాలి.ఆర్థికంగా తోడ్పాటు అందించాలి.అట్లే...భారతీయ ప్రాచీన విజ్ఞానాన్ని మళ్ళీ పాదుకొల్పాలంటే,సంప్రదాయ వైద్య విధానాలు మళ్ళీ వేళ్లూనుకోవాలంటేమెడికల్ మాఫీయాను అడ్డుకోవాలి.కనీసం! రేపటి తరాల పౌరులుపదికాలాల పాటు పచ్చగా బతకాలంటేమన విద్యావిధానంలోనూ మార్పులు రావాలి.ఆరోగ్యకరమైన జీవన విధానాలకు సంబంధించిన విషయాలను పాఠ్యాంశాలలో చేర్చాలి.వీటన్నిటిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.నిత్యం సమీక్షలు జరగాలి. వైద్యవిద్యకు పెద్దఎత్తున నిధులు కేటాయించాలి. అధ్యాపకులు,విద్యార్థుల ఎంపికలో,శిక్షణలో ప్రామాణికతలు పెరగాలి.అడుగడుగునా నాణ్యతకు పెద్దపీట వెయ్యాలి. పరిశోధనలు విస్తృతంగా జరగాలి.ఇవన్నీ జరిగితేనే ఆశయాలు సిద్ధిస్తాయి.ఆయుష్ థెరపీ,సంప్రదాయ వైద్య సేవల నిమిత్తం భారత్ రావాలనుకొనే విదేశీ పౌరుల కోసం త్వరలో 'ఆయుష్ వీసాలు' అందిస్తామని మన ప్రధాని ప్రకటించడం కొత్త అధ్యాయం. ఆయుష్ రంగంలో పెట్టుబడులు,ఆవిష్కరణలకు అపరిమితమైన అవకాశాలు ఉన్నాయి.ఔషధాల తయారీ, సౌందర్య సాధనాలకు కూడా ఉజ్వలమైన భవిష్యత్తు ఉంది.ఈ రంగాలకు ఇప్పటికే పెద్ద డిమాండ్ ఉంది.అందరూ కలిసి ఆరోగ్యకరమైన అడుగులు వేస్తే... 'ఆరోగ్యభారత్' నిర్మాణం అందని ద్రాక్ష కాదు.

# టిటిడి నిర్లక్ష్యానికి పరాకాష్ట!

తిరుపతిలో దారుణం జరిగింది. వైకుంఠ ఏకాదశి దర్శన టిక్కెట్ల కోసం వచ్చిన ఆరుగురు భక్తులను టిటిడి నిర్లక్ష్యం ఏకంగా వైకుంఠం చేర్చారు. వేలకోట్ల ఆదాయం..వందల్లో ఉద్యోగులు..వేలమంది పోలీసులు.. ఇంత మంది ఉన్నా కనీసం టోకెన్లు సక్రమంగా అందించడం కూడా రాని దౌర్భాగ్యం కనిపించింది. మొన్నటికి మొన్న పుష్ప సినిమా సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్‌లో ఓ మహిళ మృత చెందింది. ఆమె కుమారుడు చావుబతుకుల్లో ఆస్పత్రి బెడ్‌పై పోరాడుతున్నాడు. గతంలో ఆలయాల్లో కూడా తొక్కిసలాట ఘటలను చూశాం. ఇవన్నీ గుణపాఠాలు. ఇలాంటివి చూసినప్పుడు ఎలా ఉండకూడదో నేర్చుకోవాలి. తిరుమల లాంటి ప్రదేశాల్లో మరీ అవసరం. కానీ అలా జరగడం లేదు. సాధారణ రోజుల్లో తొక్కిసలాటలే..పర్వదినాల్లో కూడా అలాగే జరిగితే ఎలా అన్నది ఆలోచన చేయాలి. అయితే వైకుంఠ ద్వార దర్శనం కోసం ముందే టిక్కెట్లు అమ్మడం లేదా, టోకెటన్లు ఇవ్వడం అన్న దౌర్భాగ్యం ఏమిటో అర్థం కాదు. ఇంతగా ప్రచారం చేసి భక్తులను రప్పించి, సరిగా ఏర్పాట్లు చేయకుండా తొక్కిసలాటకు కారణమైన టిటిడి అధికారుల నిర్లక్ష్యం ఏ మాత్రం క్షంతవ్యం కాదు. పోలీసుల ప్రేక్షక పాత్ర ఇక్కడ స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు కూడా అదే కనిపించింది. టిటిడి ఛైర్మన్, ఇవో, అదనపు ఇవో ఇలా అనేకమంది నెలరోజుల ముందునుంచే అనేక రకాలుగా సమీక్షలు చేశారు. అట్టహాసం ప్రకటించారు. కానీ జరగాల్సిన నష్టం జరిగింది. వైకుంఠ ఏకాదశి సర్వదర్శన టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం దారుణమైన ఘటనగానే భావించాలి. టోకెన్ల జారీకి తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో 90 కౌంటర్లు ఏర్పాటు చేయగా... బైరాగిపట్టెడ వద్ద ఈ దారుణం జరిగింది. దైవదర్శనం కోసం వచ్చే భక్తులు రెండు రోజులముందే టోకెన్లు పొందాలని నిబంధన పెట్టడమే దారుణం. అలా కాకుండా తిరుమలలో క్యూలైన్లలో వచ్చిన వారికే దర్శనం కల్పించివుంటే ఈ దారుణం జరిగివుండేది కాదు. తిరుపతిలో టోకెటనలు పొందాలనడమే దారుణం. క్యూలైన్లో ఉన్న భక్తులను ఒక్కసారిగి విడిచిపెట్టడంతో తోపులాట జరిగిందని, ఒకరినొకరు తోసుకుంటూ పోవడంతో ఈ ఘటన జరిగిందని అక్కడ ఉన్నవారు చెబుతున్నారు. సరిగా భద్రత లేదని 3, 4గురు పోలీసులు ఉన్నారని.. తొక్కిసలాట జరిగినప్పుడు 20 మంది వరకు వచ్చారని తెలిపారు. నాలుగు లైన్లలో ఉన్నవారిని ఒక్కసారి వదలడంతో ఈ సమస్య వచ్చిందని అంటున్నారు. ప్రతి ఏడాది తాము వైకుంఠ ఏకాదశికి తిరుమల వస్తామని, ఇలా జరగడం ఇది మొదటిసారని భక్తులు తెలిపారు. నిజానికి ఆన్‌లైన్‌లో టిక్కెట్లు జారీ చేసినా, లేకుంటే దర్శనం కోసం నేరుగా వచ్చిన వారికి మాత్రమే టోకెన్లు జారీ చేసినా ఈ దుర్ఘటన జరిగివుండేది కాదు. కానీ అలా కాకుండ రెండ్రోజుల ముందే భక్తులు వచ్చేలా చేసి, క్యూలైన్ల వద్ద పడిగాపులు కాచేలా చేయడం ఎంతవరకు సమంజసమో టిటిడి పెద్దలు చెప్పాలి. శ్రీవారిమీద భక్తితో వేలకోట్లు టిటిడికి భక్తులు చెల్లిస్తున్నా విఐపిల సేవలు తరిస్తున్నారు. వారికే దర్శనం విషయంలో పెద్దపీట వేస్తున్నారు. కొండపైనే ఏర్పాట్లు చేసి, టోకెన్లు ఇచ్చి ఉంటే ఈ తొక్కిసలాట జరిగేదికాదు. తిరుపతిలో టిక్కెట్లు ఇవ్వడంతో భక్తుల సంఖ్య పెరిగిందని దానికి తగ్గట్టుగా పోలీసు భద్రత లేదని అరథం అవుతోంది. భక్తులను క్యూలో ఒక్కసారిగి విడిచిపెట్టకూడదని.. ఒక్కొక్క క్యూలైన్ విడిచిపెడితే తొక్కిసలాట జరిగేది కాదని కూటా అంటున్నారు. ఒకటో కంపార్టుమెంట్ నుంచి వదిలితే బాగుండేదని, అలా కాకుండా 4, 5 క్యూలైన్లు విడిచిపెట్టారని దీంతో అంతా ఒకేసారి రావడంతో తోపులాట జరిగిందని భక్తులు తెలిపారు. ఒక్కసారిగా గేట్ తీసినప్పుడు భక్తులంతా తోసుకుని వచ్చారని.. తెలిపారు. పురుషులు కూడా మహిళలు, పిల్లలు ఉన్నారని చూసుకోవడం లేదని తోసుకుంటూ వచ్చారని అర్థం అవుతోంది. నిజానికి శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల విషయంలో ఆదినుంచీ టిటిడిది నిర్లక్ష్యమే. వేలమంది వస్తుంటే అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయకుండా..విఐపిలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్నాయి. దీని కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసిందని చెబుతోంది. తిరుపతిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచి టోకెన్లను జారీ చేయాలని టీటీడీ యంత్రాంగం తొలుత నిర్ణయించింది. అయితే... బుధవారం మధ్యాహ్నం నుంచే కేంద్రాల వద్దకు భారీగా భక్తులు తరలి రావడం మొదలైంది. రాత్రి 8 గంటలకు ఒత్తిడి మరింత పెరిగింది. క్యూలైన్లలోకి రాత్రి 9 గంటల నుంచి భక్తులను పంపించడం మొదలుపెట్టారు. దీంతో కేంద్రాల వెలుపల నిరీక్షిస్తున్న భక్తులు క్యూలైన్లలో ప్రవేశించడానికి ప్రయత్నించే క్రమంలో తొక్కిసలాటలు జరిగాయి.

# నవ్వు దైవ దత్త దివ్యౌషధం

నవరసాల సారమే జీవనం. అందులో ఏ రసం పాలు తక్కువైనా సమస్య లేదు కానీ, హాస్యరసం పాలు మాత్రం అసలు తక్కువ కాకూడదు. అది లోపిస్తే జీవితమంతా వేదనే మిగులుతుంది. అయితే, నేటి యాంత్రిక జీవనంలో, పోటీ ప్రపంచంలో మన జీవితాల్లో హాస్యరస పాలు క్రమంగా తగ్గిపోతోంది. ఆవేశం, ఆగ్రహం, అసంతృప్తి, అహం, మానసిక ఒత్తిడి వంటివి నవ్వును, నవ్వే గుణాన్ని మింగేస్తున్నాయి.ప్రపంచ నవ్వుల దినోత్సవం మొదటి సారిగా 1998, జనవరి 10న భారత దేశంలోని ముంబైలో జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా నవ్వు యోగా ఉద్యమాన్ని ప్రారంభించిన డాక్టర్ మదన్ కటారియా ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. మొదట జనవరి రెండవ ఆదివారం జరుపుకునే వారు. జనవరిలో చలి ఎక్కువగా ఉంటుందన్న హాస్య ప్రియులు కోరిక మేరకు లాఫ్టర్ క్లబ్ ఇంటర్నేషనల్ దీన్ని మే మొదటి ఆదివారం జరుపుతూ వచ్చింది. అయితే భారత దేశంలో జనవరి 10న మొదటి సారి ఈ దినోత్సవాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది భారత దేశమే, భారతీయులే కావడం విశేషం. ముంబైకి చెందిన ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ మదన్ కటారియా ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని సృష్టించారు. 'నవ్వు ఒక యోగం' అనే కాన్సెప్ట్ ప్రపంచానికి చాటిన అయన భారతీయుడే కావడం విశేషం. వ్యక్తులు తమను తాము మార్చుకోవటానికీ, ప్రపంచాన్ని శాంతియుతంగా, సానుకూలంగా మార్చడానికి అవసరమైన శక్తివంతమైన భావోద్వేగం నవ్వు ఒక్కటే. నవ్వు అనేది ఒక వ్యక్తి ముఖ కవళికలు, భావోద్వేగాలపై ప్రభావం చూపుతుందన్న ఉద్దేశ్యంతో మదన్ కటారియా నవ్వు యోగా ఉద్యమాన్ని ప్రారంభించారు. మొదట్లో నవ్వుల క్లబ్ (లాఫర్ క్లబ్)గా ప్రారంభమైన ఈ వేడుక తరువాత కాలంలో 65 దేశాలలో ఆరు వేల క్లబ్బుల వరకు విస్తరించింది. నవ్వడం వలన శరీరంలో ఉన్న రోగాలన్నీ మటుమాయమై పోతాయని ఆరోగ్య నిపుణులు చెపుతున్నారు. నవ్వడం మూలాన జీవితంలోని ఎన్నో రకాల ఆరోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండొచ్చని వారంటున్నారు. రోజులో కనీసం నాలుగైదు సార్లయినా మనసారా నవ్వడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుంది. ఒక మనిషి సంతోషంగా ఉంటే అతని కుటుంబం సంతోషంగా ఉంటుంది. అలా కుటుంబాలన్నీ సంతోషంగా ఉంటే సమాజమంతా సంతోషంగా ఉంటుంది.. అప్పుడు ప్రపంచమంతా సంతోషంగా ఉంటుందనేదే ఈ నవ్వుల దినోత్సవ నిర్వహణ వెనుక ఉన్న భావన.

**హాస్యానికి పుట్టినిల్లు భారత్?**

భారతదేశంలో హాస్యానిది తొలి నుంచీ పెద్దపీటే. రాజుల ఆస్థానాలలో విదూషకులు కేవలం మహారాజులను నవ్వించడానికే ఉండేవారు. తెనాలి రామకృష్ణుడు, బీర్బల్? పండించిన హాస్యం అజరామరం. ఈ రెండు తరహాల కథలు నవ్వుతో పాటు ఆలోచనను కలిగిస్తాయి. నిజానికి నవ్వుతో లేదా జోక్



తో ఆలోచనను రేకెత్తించే హాస్యమే మరుపు రాకుండా మిగిలి పోతుంది. అక్బర్ - బీర్బల్ కథలు ఎన్నో ఆలో చనలను రేకెత్తిస్తాయి. తెనాలి రామకృష్ణుడి కథలు తెలివిని పెంచుతాయి. పరమానందయ్య శిష్యుల కథలు కూడా మంచి హాస్యాన్ని పుట్టిస్తాయి. మన జానపద గీతాల్లోనూ హాస్యరసం పొంగి పొర్లుతుంది. ఇంకా పల్లెసుద్దుల్లో, పల్లెల్లో పనిపాటు చేసుకుంటూ పాడుకునే పాటల్లో ఎంతో సునిశిత హాస్యం దొర్లుతుంది. పువ్వులు, పక్షులు, జంతువులు.. తమ తమ స్వభావాలతో తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని, పరిసరాలను ఆనందమయంగా చేసుకుంటాయి. వాటితో పోలిస్తే విచక్షణ, వివేకం కలిగిన మానవులం ఈ జీవితాన్ని, ఎందుకు సంతోషకరం చేసుకోలేం. ఈ సృష్టిలో పైసా ఖర్చు లేనిది చిరునవ్వు మాత్రమే. కానీ, దాన్ని 'కొనితెచ్చు' కోవాల్సినంత దుస్థితిలో మానవ జీవితాలు ఉన్నాయి.రోజుల్లో వస్తున్న సగం జబ్బులకు ఒత్తిడే కారణం. 70 శాతం రోగాలు ఒత్తిడితోనే కలుగుతున్నాయనేది వైద్య అధ్యయనాల సారాంశం. అధిక రక్తపోటు, గుండె జబ్బులు, డిప్రెషన్? (కుంగుబాటు), అలర్జీ, ఇన్సోమియా, మైగ్రేయిన్?, ఆతృత, పెప్టిక్? అల్సర్?.. ఇవన్నీ ఒత్తిడి వల్ల వచ్చేవే. నవ్వుల టానిక్? మాత్రమే వీటికి ఔషధం. ఉదయం లేస్తూనే ఒక చిరునవ్వును ముఖంపైకి తెచ్చుకుంటే ఇవన్నీ మటుమాయమైనట్టే. నవ్వుతో రోగనిరోధక వ్యవస్థకు అవసరమైన లింపొజైట్స్ ఉత్పత్తి పెరుగుతుంది. ముక్కు, శ్వాసకోశాల్లోని పొరల్లో మెరుగుదల ఉంటుంది. శరీరంలో సహజరోగ నిరోధక హార్మోన్ల ఉత్పత్తి పెరిగి ఆర్థరైటిస్, స్పాండలైటిస్, మైగ్రేన్ లాంటి వ్యాధులకు ఉపశమనం లభిస్తుంది. ఊపిరి తిత్తుల సామర్థ్యం, రక్తంలో ఆక్సిజన్ పరిమాణం పెరుగుతాయి. దీని వల్ల ఆస్తమా రోగులకూ మేలు జరుగుతుంది.మనుషులు వేర్వేరు భాషలు, దేశాలకు చెందిన వారైనా అందరికీ అర్థమయ్యే, అందరికీ వచ్చే యూనివర్సల్ లాంగ్వేజ్ మాత్రం నవ్వే. ఇది ఎవరూ నేర్చుకొనే అవసరం లేని భాష. అందరిలోనూ సహజ, స్వభావ సిద్ధంగా ఉంటుంది. అయితే, ప్రతి మనిషీ తనలో సహజంగా ఉండే నవ్వును నవ్వడం లేదా దానిని ఉపయోగించడం నానాటికీ మరిచి పోతున్నాడు. పుట్టుకతోనే అబ్బే విద్య నవ్వు మాత్రమే. సకల జీవరాశిలో మనిషికి మాత్రమే నవ్వుకునే, నవ్వే గుణమూ, లక్షణమూ ఉన్నాయనుకోవడం అజ్ఞానం. చాలా గుణాలలాగే నవ్వు కూడా మన చుట్టూ ఉన్న జీవరాశి అంతటిలో ఉన్నాయి. పువ్వులు వికసించడమే హాసం. పక్షుల కిలకిలరావాలే కిలకిలల నవ్వులు. జంతువులు చేసే కొన్ని శబ్దాలు నవ్వులకు సంకేతాలే. నవ్వు అనేది మనిషి అభ్యాసంతో నేర్చుకునే విద్య కాదు. జన్మతః లభించిన లక్షణం. సెల్ ఫోన్లు మానవ జీవితంపై ఎంతో ప్రభావం చూపుతున్నాయి.సెల్‌ఫోన్లు వచ్చాక మనుషుల మధ్య మాటలే కరువయ్యాయి. ఇద్దరు మనసు విప్పి మాట్లాడు కుంటేనే కదా.. ఆ సంభాషణలో నుంచి హాస్యం పుట్టేది. ఇప్పుడు ఎవరికి వారు సెల్‌ఫోన్ల తోనే మాట్లాడు తున్నారు. అరచేతిలోని సెల్ ఫోన్ మనసుకు నవ్వును తాకనివ్వడం లేదని ఎవరూ గుర్తించడం లేదు. వాట్సాప్‌లో పోస్టుల జోకులకే నవ్వు తున్నాం. స్వత హాగా నవ్వడం ఏనాడో మరిచి పోయాం. చింతలు, చికాకులు, అర్థం లేని లక్ష్యాల వైపు పరుగులతో మనిషిలో హాస్య ప్రియత్వ సహజ లక్షణం తగ్గిపో తున్నది. నవ్వు ఇలా మహా భాగ్యమైపోయినందుకే లాఫింగ్? క్లబ్బులు వచ్చాయి. మనిషి కొత్తగా నవ్వడం నేర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.నవ్వు యోగమే కాదు.. నవ్వు వ్యాయామం కూడా. ముఖంలో నవ్వు కనబడాలి అంటే ముఖం లోని ముప్పై రెండు కండరాలు కదలాలట. నవ్వడం కూడా ఒక వ్యాయామం. ఒక్క నవ్వుతో 32 కండరాలను కదిలించడం అంటే అది ఎంత గొప్ప వ్యాయామం కాక మరేమిటి. చక్కని నవ్వు వల్ల ముఖ కవళికలు మెరుగవుతాయి. ముఖ కండరాల్లో రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. వృద్ధాప్య ఛాయలు, ముడతలను దరి చేరనివ్వదు. మనసు స్వచ్ఛంగా ఉన్న వాళ్లకే స్వచ్ఛమైన నవ్వు వస్తుంది. యోగాతో పోలిస్తే నవ్వడం చాలా సులువు. యోగా అంటే కొన్ని భంగిమలు ప్రదర్శించాలి. దీనికి అవేమీ అవసరం లేదు. పెదాలను కాస్త కదిలిస్తే చాలు.. మానసిక ఒత్తిడిని నవ్వు తగ్గిస్తుంది. హాయిగా నవ్వడం వల్ల ఒత్తిడి దిగిపోయి రిలాక్స్ కలుగుతుంది. కుంగుబాటు (డిప్రెషన్) నుంచి నవ్వు బయట పడవేస్తుంది. ఉద్విగ్నత, భావోద్వేగాలను నవ్వు సమస్థితిలో ఉంచుతుంది. ఇవి అదుపులో ఉంటేనే ఇతరులతో సంబంధ బాంధవ్యాలు సవ్యంగా గలుగుతారు. అంటే మనసులో ఎటువంటి కల్మషం లేని వారు మనసారా స్వచ్ఛంగా నవ్వగలరు.

రామ కిష్టయ్య సంగన భట్ల

# మార్గశిర శుద్ధ అష్టమి

శ్రీ కాలభైరవ అష్టమి. పిలిచిన పలికే దైవం, భక్తుల బాధాలను, గ్రహపీడలను, రోగాలను నయం చేసే శక్తి, కర్మబంధాల నుంచి విమోచనం కలిగించగల దైవం శ్రీకాలభైరువుడు. అటువంటి కాలభైరవ స్వామికి ప్రీతికరమైన, విశేషమైన రోజు కాలభైరవాష్టమి. ఆ విశేషాలు తెలుసుకుందాం. మార్గశిర మాసంలోని శుక్ల పక్ష అష్టమి- "కాలభైరవాష్టమి". పరమ శివుడి వల్ల కాలభైరవుడు ఆవిర్భవించిన రోజే 'కాలభైరవాష్టమి'. లయకారుడైన పరమశివుడివల్ల ఆవిర్భవించి సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడి ఐదవ శిరస్సును ఖండించిన కాశీ క్షేత్రంలో క్షేత్ర పాలకుడుగా కొలు వుదీరిన దేవడు - కాలభైరవుడు. శ్రీకాలభైరవుడు ఆవిర్భవించిన "కాలభైరవాష్టమి" పర్వదినమును జరుపుకుని కాలభైరవుడిని పూజించాలని శాస్త్రవచనం.కాలభైరవస్వామి ఆవిర్భవానికి సంబంధించి "శివపురాణం"లో ఆసక్తికరమైన పురాణగాథ వుంది. పూర్వం సృష్టి ప్రారంభంలో బ్రహ్మదేవుడికి శివుడికి మధ్య ఒక వివాదం ఏర్పడింది. బ్రహ్మదేవుడు శివుడివద్దకు వెళ్ళి - "నేనే సృష్టికర్తను... పరబ్రహ్మ స్వరూపుడను... నేను చెప్పినట్లుగానే మీరందరూ నడుచుకోవాలి" అని పలికాడు. శివుడు అందుకు వ్యతిరేకించాడు. దీనితో ఇద్దరి మధ్య వాదం ప్రారంభమై చాలాసేపు వారిద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి. బ్రహ్మదేవుడు మధ్యన వున్న తన ఐదవ శిరస్సుతో శివుడిని తూలనాడడం ప్రారంభించాడు. దీనితో కోపోద్రిక్తుడైన శివుడు హూంకరించాడు. ఆ హూంకారం నుంచి ఒక భయంకర రూపం ఆవిర్భవించింది. మహోన్నతకాయముతో... మూడు నేత్రాలతో త్రిశూలము, గద, ఢమరుకము వంటి వాటిని చేతులతో ధరించిన ఆ భయంకర రూపుడే - శ్రీకాలభైరవుడు.ఈ విధంగా శివుడి హూంకారంతో జన్మించిన కాలభైరవుడు తన జననానికి కారణం చెప్పమని శివుడిని కోరాడు. శివుడి ఆజ్ఞ మేరకు కాలభైరవుడు బ్రహ్మదేవుడి ఐదు శిరస్సులలో మధ్యనవున్న ఐదవ



శిరస్సును ఖండించాడు. దీనితో బ్రహ్మదేవుడి గర్వం అణిగిపోయింది. అనంతరం శ్రీకాలభైరవుడు లయకారుడైన శివుడి ముందు నిలబడగా- "నీవు బ్రహ్మదేవుడి శిరస్సును ఖండించడంవల్ల నీకు బ్రహ్మహత్యాపాతకం సోకింది. కనుక నీవు బ్రహ్మ కపాలాన్ని చేతిలో ధరించి తీర్థయాత్రలు చేయమని సలహాయిచ్చాడు. బ్రహ్మహత్యాపాతకమును తొలగించుకునేందుకు బ్రహ్మ కపాలాన్ని చేతిలో ధరించి అనేక క్షేత్రాలలో పర్యటించినా తనకు సోకిన బ్రహ్మహత్యాపాతకము తొలగకపోవడంతో కాలభైరవుడు శ్రీమహావిష్ణువు వద్దకు వెళ్ళి ప్రార్థించాడు. కాలభైరవుడి ప్రార్ధన విన్న శ్రీ మహావిష్ణువు -"కాలభైరవా! నీవు శివుడి పుత్రుడవు కనుక శివుడితో సమానుడవు. బ్రహ్మ దేవుడి గర్వమును అణుచుటకు జనించినవాడవు. నీవు ఎన్ని తీర్థయాత్రలు చేసినా ఉపయోగం లేదు. కనుక నీవు కాశీ క్షేత్రానికి వెళ్ళు... కాశీ క్షేత్రంలో అడుగుపెట్టినంతనే నీ బ్రహ్మ హత్యాపాతకం భస్మమైపోతుంది" అని సలహాయిచ్చాడు.దీనితో- కాలభైరవుడు కాశీ నగరానికి చేరుకోవడంతోనే బ్రహ్మహత్యాపాతకం తొలగిపోగా, బ్రహ్మకపాలాన్నీ కాశీలో పూడ్చిపెట్టాడు. బ్రహ్మకపాలం పూడ్చిపెట్టిన చోట ఏర్పడిన తీర్థమే - నేటి కాశీ క్షేత్రంలోని "కపాల మోక్షతీర్థం". తర్వాత కాశీక్షేత్రంలో శ్రీకాలభైరవుడు కొలువుదీరి క్షేత్రపాలకుడుగా పూజలందుకుంటూ వున్నాడు. కాలభైరవుడిని కాశీలో ముందుగా దర్శించే ఆచారంతోపాటూ... కాశీకి వెళ్ళి వచ్చినవారు "కాశీ సంతర్పణం" కంటే ముందుగా కాలభైరవ సంతర్పణ చేయడం శ్రీ కాలభైరవస్వామి వారి మహత్యానికి నిదర్శనం.ఈ విధంగా ఆవిర్భవించిన కాలభైరవ స్వామి వారి జన్మదినమైన "కాలభైరవాష్టమి" నాడు శ్రీకాలభైరవుడిని స్మరించడం, పూజించడంవల్ల సకల పుణ్యాలు కలగడం తోపాటూ... సర్వవిధాలైన భయాలు నశిస్తాయి. కాలభైరవాష్టమి నాడు తెల్లవారురుఝామునే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని తలస్నానం చేయాలి. కాలభైరవుడి విగ్రహాన్నిగాని, చిత్రపటాన్నిగానీ పూజామందిరంలో ఏర్పాటుచేసుకుని ముందుగా గణపతిని పూజించి తర్వాత శ్రీకాలభైరవస్వామి వారిని షోడశోపచారము, అష్టోత్తరాలతో పూజించి, శక్తిమేరకు నైవేద్యమును సమర్పించవలెను. ఆ రోజు మధ్యాహ్నం మాత్రమే భోజనం చేసి రాత్రిపూట ఉపవాసం వుండవలెను. ఆదిశంకరాచార్యుల వారు రచించిన "కాలభైరవాష్టకమ్"ను పారాయణం చేయాలని శాస్త్రవచనం. ఈ విధంగా కాలభైరవాష్టమిని జరుపుకొనడంవల్ల సర్వవిధాలైన భయాలు తొలగిపోయి అనంతమైన పుణ్యఫలాలు లభిస్తాయి. కాలభైరవాష్టకమును నిత్యం పఠించడం కూడా మంచిదే!

సేనాధిపత్యం రమేష్

# చాలా విషయాలను మనం వదిలేయాలి

వయసు పెరిగితే మనకేమీ కొత్తగా కొమ్ములు పొడుచుకుని రావు. చాలా విషయాలను మనం వదిలేయాలి."చలం" (గుడిపాటి వెంకటాచలం), గాయని వాణీ జయరామ్, ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం గార్లను ఆదర్శంగా పెట్టుకోవాలి.చలంగారు తానూ, తన స్నేహితుడూ ముచ్చటించుకుంటూ ఉండగా పిల్లలు వాళ్ళ ఇంట్లోని వంటపాత్రలతో ఆడుకుంటూ ధ్వనులు చేస్తుండగా స్నేహితుడా పిల్లలను వారించాడు.అప్పుడు చలం "మనకు మన ముచ్చట్లు ఎంత ముఖ్యమో, ఆ పిల్లలకు వాళ్ల ఆటా అంతే ముఖ్యం. వయసులో పెద్దవాళ్లమైనంత మాత్రాన వాళ్ల ఆటలను ఆపెయ్యమనడానికి మనకు హక్కెక్కడిదీ?" అన్నారు. ఇలాంటి ఉన్నతాలోచనా పథాన్ని అలవరచుకునే ప్రయత్నంలో కొంత విజయం సాధించాలి.వాణీ జయరామ్ గారు చిన్న పిల్లలను సైతం "మీరు" అనే సంబోధిస్తారు. ప్రయత్నించినా ఆ తత్త్వం మనకు అబ్బడంలేదు.ఎస్పీ బాలు గారు శబరిమలకు డోలీలో వెళ్ళిన సందర్భంలో డోలీ మోసినవాళ్ళ కాళ్ళకు మోకరిల్లారు. అది వాళ్ళ వృత్తికావచ్చుగాక. వాళ్ళు ఆ పనిచేసినందుకు డబ్బులిస్తుండ వచ్చు గాక. వాళ్ళే లేకపోతే మనవద్ద డబ్బులుండీ లాభమేమిటి ?మనమెలాగూ ఎస్పీలాగా పాదాభివందనం చేసేంత గొప్పవాళ్లం కాలేం. కనీసం "థాంక్స్" చెప్పొచ్చు కదా. కాగా ఒక సందర్భంలో "మన శరీరంలో తగినంత శక్తి ఉండగా ఇతరులకు డబ్బులిచ్చే అయినా బ్యాగులు మోయించొద్దు" అనీ "ఎవరిచేతనైతే నీ లగేజీని మోయిస్తావో వాళ్ళ పదింతల లగేజీని వచ్చే జన్మలో నీవు మోయకతప్పదు" అన్నారు. శ్రీకంచి కామకోటి పీఠాధిపతి స్వామి గారు. చాలామటుకు దీనికీ కట్టుబడి ఉండే ప్రయత్నము చేయాలి.మనం చాలా విషయాలను పట్టుకోవటం కష్టం కానీ వదిలేయడంలో బాధ ఏమిటీ.

ఏం వదిలివేయాలో చూద్దాం.

"అమ్మాయీ గ్యాసు కట్టేసావా....

గీజర్ ఆఫ్ చేసావా...



ఏ.సి ఆన్ లో ఉన్నట్లుంది..

పాలు ఫ్రిజ్ లో పెట్టావా....

...లాంటి ఎంక్వయిరీలు వదిలేద్దాం.

"మా కొడుకూ, కోడలూ పట్టించుకోరు" అంటూ తామేదో పర్వతాలను మోస్తున్నట్లు బిల్డప్ ఇస్తూ తమ పరువు తామే తీసుకుంటున్న తలిదండ్రులున్నారు.వాళ్ళ హయాంలో వాళ్ళిష్టం..కష్టనష్టాలు కూడా వాళ్ళవే.ఎవరితో ఏపనీ చేయించుకోకుండా ప్రతీపనీ మన పనే అనుకుంటే ఎంత ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉండగలమో కదా..నా అభిప్రాయం ఏమిటంటే అని అనటం తగ్గించి.. నీ ఇష్టం నువ్వు చెప్పు అని వాళ్ళ ఇష్టాయిష్టాలతో వాళ్ళని బ్రతకనిస్తే గృహమే ఔతుంది కదా స్వర్గసీమ.నాకూ తెలుసు తో పాటు. నాకు మాత్రమే తెలుసు అనే ఆలోచనను తగ్గించుకుని, వాళ్ళకి చాలా విషయాలు, టెక్నాలజీ నాకంటే ఎక్కువ తెలుసు కదా అనే నిజాన్ని ఒప్పేసుకుంటే చాలు.మన పిల్లలకోసం వచ్చేవారితో మనం మితంగా మాట్లాడాలి. వాళ్ళు మనకోసం రాలేదు అని గుర్తుంచుకుని కాసేపు కర్టెసీకి మాట్లాడి లేచి మన గదిలోకి మనం వెళ్ళిపోగలగాలి.పెద్దవారిని పలకరించే మర్యాదతో ఎవరైనా సహజంగా అడుగుతారు. ఆరోగ్యం బాగుంది కదా అని దయచేసి వెంటనే అతిగా స్పందించవద్దు. మన బి.పి, షుగర్ కీళ్ళనొప్పులు, నిద్ర పట్టకపోవటం. నీరసం అంత రసవత్తరమైన విషయాలుకావు కదా. బాబోయ్.. ఎందుకు అడిగామా అనే పశ్చాత్తాపం వారికి కలిగించవద్దు.కాలం మారింది, మారుతున్నది శరవేగంగా.. టెక్నాలజీ అన్నింటా చోటు చేసుకుంటున్నది. విమానంలో ప్రయాణించే వారికి ఎర్రబస్సులో సీటెలా పట్టుకోవాలో మనం చెబితే ఏం ప్రయోజనం.పెద్దతనంలో మన పరువును కాపాడుకోవటం పూర్తిగా... పూర్తిగా మన చేతుల్లోనే ఉందని ఘంటాపథంగా చెప్పగలను.అనవసరవిషయాల్లో జోక్యం చేసుకోకుండా మితభాషిగావుంటూ మన ఆర్థిక స్వాతంత్ర్యం కోల్పోకుండా... ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ...జిహ్వాచాపల్యం తగ్గించుకుని. అన్నింటికంటే ముఖ్యమైన విషయం నన్ను ఎవరూ గౌరవించటంలేదు అనే ఆత్మన్యూనతాభావం దరికి చేరకుండా జాగ్రత్తపడాలి...భావం, బంధాలు, అంత తేలికగా తగ్గించుకోలేము. కనీసం కొన్ని విషయాలను వదిలివేద్దాం.ప్రతీ విషయాన్నీ పాజిటివ్ గా చూడాలి. ఉద్యోగానికి పరిగెత్తాలనే హడావిడి లేదు. మొత్తం సంసారాన్ని లాగే బాధ్యతా లేదు. పిల్లలకి సహకరిస్తున్నామనే తృప్తి ఉండనే ఉంది.హాయిగా పూజలు చేసుకోవచ్చు. భగవద్గీత, భాగవతం చదువుకోవచ్చు. పుణ్యమూ, పురుషార్థమూ కూడా సిద్ధిస్తాయి.రోజూ అనుకుందాం ఇలా.. మన ఆత్మవిశ్వాసాన్ని పెంచే మంత్రాలివి. చివరగా మనం దిగవలసిన స్టేషన్ దగ్గరౌతూనే వుంది. సమయం దగ్గర పడుతూనే ఉంది.మన బోగీలో ఉన్న మన తోటి ప్రయాణీకులతో తగువులు, మనస్పర్థలు, ఎత్తిపొడుపు మాటలు అవసరమా.మనం దిగుతుంటే వారి ముఖాల్లో హమ్మయ్య. అనే భావం కనిపించాలో...లేక అయ్యో అప్పుడే వీళ్ల స్టేషన్ వచ్చేసిందా.. అనే భావం కనిపించాలో నిర్ణయం మన చేతిలోనే ఉంది.

# పారిశుద్ధ్య పనులు త్వరితగతిన పూర్తి చేయండి

**జివిఎంసి కమీషనర్ డాక్టర్ సంపత్ కుమార్**



**విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రప్రత్రిక) :** మహా విశాఖ నగరంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ రోడ్ షోలో పర్యటించిన, ప్రసంగించిన కార్యక్రమ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రపరచాలని, జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జోన్ 3 లో జరుగుచున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, బుధవారం భారత ప్రధాని సిరిపురం జంక్షన్ నుండి ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ మైదానం వరకు రోడ్ షోలో పర్యటించిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను వెంటనే చేపట్టి ఆయా ప్రాంతాలను పరిశుభ్రపరచే చర్యలు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి. నరేష్ కుమార్ కు ఆదేశించారు. రోడ్ షోలో రోడ్డుకు ఇరువైపులా, మధ్యలో ఏర్పాటుచేసిన బార్కేడ్లను, అదనంగా ఏర్పాటు చేసిన వీధిలైట్లను వెంటనే తొలగించి ఆ యా ప్రాంతాలను పరిశుభ్రపరిచే చర్యలు చేపట్టాలని ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాదరాజు కు, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ కు కమిషనర్ ఆదేశించారు. రోడ్డు షో కొరకు రోడ్డుపై గుంతలు కలగకుండా, రోడ్లు మరమ్మతుకు గురికాకుండా సులభంగా అతికించి తొలగించుకునేలా బార్కేడ్లను వినూత్నంగా ఏర్పాటు చేసినందుకు ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ అభినందించారు. ప్రధానమంత్రి పర్యటించిన ప్రాంతాల్లో అన్ని పనులను పూర్తి చేసి ,పారిశుద్ధ్య పనులను చేపట్టి ఆయా ప్రాంతాలను పరిశుభ్రపరిచేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు కమిషనర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీరు పి.వి.సత్యనారాయణ రాజు, కార్యనిర్వాహక ఇంజనీర్ గంగాధర్, సహాయ వైద్యాధికారి బి.ప్రసాద రావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సిహెచ్.మధుసూదన రావు, శానిటరీ సూపర్వైజర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్ గోవిందరావు, వార్డు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి చెప్పండి

**జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్**

**విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రప్రత్రిక):** విశాఖను ప్లాస్టిక్ ఫ్రీ సిటిగా తీర్చిదిద్దడమే ప్రథమ లక్ష్యమని, జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన జీవీఎంసీ జోన్-3, వార్డు-27 లో ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగానున్న సాయి కృష్ణ పార్లర్ దుకాణంలో "సే నో టు ప్లాస్టిక్" స్టిక్కర్ ను వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు, జివిఎంసి అధికారులతో కలిసి అతికించి అందరికీ అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ మహమ్మారిని ఈ నగరం నుండి తరిమి వేయడమే ప్రథమ కర్తవ్యంగా విశాఖ నగరం లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను జనవరి 1వ తేది నుండి నిషేధించడమైనదని, ఆ దిశగా ప్రజలకు, వినియోగదారులకు, ఉత్పత్తి, అమ్మకం, సరఫరాదారులకు అవగాహనపరుస్తూ, అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. విశాఖ నగరం లో వ్యాపార లైసెన్సులు కలిగిన 50 వేల దుఖాణాలలో, వాణిజ్య సముదాయాలలో "సే నో టు ప్లాస్టిక్" అనే స్టిక్కర్లను గురువారం 598 సచివాలయాల పరిధిలో గల అందరు వార్డు కార్యదర్శులు, శానిటరీ ఇన్ స్పెక్టర్లు, ఆర్పీలు, ఎస్.హెచ్.జి మహిళల ద్వారా సమూహంగా దుఖాణాలలో ఒకేసారి అతికించే కార్యక్రమం చేపట్టడమైనదన్నారు.

ఈ సందర్భంగా సాయి క్రిష్ణ పార్లర్ నందు సే నో టు ప్లాస్టిక్ స్టిక్కర్ ను అతికించిన అనంతరం కమీషనరు జూమ్ యాప్ ద్వారా వార్డు కార్యదర్శులతో మాట్లాడుతూ, గురువారం నుండి సంక్రాంతి లోగా అన్ని దుఖాణాలలో ఈ స్టిక్కర్లను అతికించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వినియోగించరాదని కొనుగోలు దారులకు దుఖాణాల యజమానులు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు.

అనంతరం "ఐ సపోర్టు ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్", " సే నో టు ప్లాస్టిక్" అనే నినాదంతో ఏర్పాటు చేసిన ర్యాలీలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్ కుమార్, జివిఎంసి యుసిడి విభాగం సిబ్బంది తదితరులుతో కలసి పాల్గొని అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ రహిత విశాఖ నగర అభివృద్ధికి ప్రజలందరు సహకరిస్తూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కు బదులుగా నగరం లో విరివిగా లభిస్తున్న ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.




ఈ కార్యక్రమం లో 3వ జోనల్ కమీషనరు కె.శివప్రసాద్, ఎ.ఎమ్.ఒ.హెచ్. బి.ప్రసాదరావు, ఎపిడి రాము, ఆర్పీలు, ఎస్.హెచ్.జి మహిళలు, జూమ్ యాప్ నందు అన్ని సచివాలయాల పరిధిలో గల అందరు వార్డు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## 18న జిల్లా ప్రజా పరిషత్

# స్థాయీ సంఘ సమావేశం

**జిల్లా పరిషత్ సీఈవో పి. నారాయణమూర్తి**

**విశాఖపట్టణం, జనవరి 09 (ఆంధ్రప్రత్రిక):** జిల్లా ప్రజా పరిషత్ ఛైర్పర్సన్ అధ్యక్షతన ఈనెల 18వ తేదీ ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు జడ్పీ స్థాయీ సంఘ సమావేశం నిర్వహించనున్నట్లు, జిల్లా పరిషత్ సీఈవో పి. నారాయణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఛైర్పర్సన్ జె. సుభద్ర అధ్యక్షతన ఆమె ఛాంబర్ సమీపంలోని వి. సి హాలులో, జడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం నుంచి నిర్దేశిత సమయాల్లో జరుగుతాయని, సంబంధిత ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు సమావేశాలకు హాజరుకావాలని ప్రకటన ద్వారా కోరారు.

# తిరుపతి తొక్కిసలాట ఘటనలో సర్కారుదే పాపం

**మండల మాల మహానాడు అద్యక్షుడు దేబార్కి ఆవేదన**



**వేపాడ, జనవరి, 9 (ఆంధ్రప్రత్రిక):**-తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఏడుగురు భక్తులు మృత్యువాతకు గురైన పాపం సర్కారుదేనని మండల మాలమహానాడు అద్యక్షుడు దేబార్కి కిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు.మండల కేంద్రం వేపాడలో ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ గతంలో ఇటువంటి నిర్లక్ష్యం వల్లే రాజమండ్రి పుష్కరాలలో 29మంది భక్తులు మృతి చెందిన సంఘటన మరువక ముందే తిరుపతిలో ఏడుగురు భక్తులు మృతి చెందడం ఘోరాతిఘోరమని,ఈ దుస్సంఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని కిరణ్ డిమాండ్ చేశారు.పాలకులు, అదికారులు,టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు బాధ్యతా రాహిత్యమే కారణమని,ఈ సంఘటనకు బాధ్యత వహిస్తూ టీటీడీ చైర్మన్ వెంటనే రాజినామా చేయాలనీ కోరారు.అలాగే మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 50లక్షలు చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని,అలాగే ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవలసిన అవసరం బాధ్యత ప్రభుత్వంపై ఉందని మండల మాల మహానాడు అద్యక్షుడు దేబార్కి కిరణ్ అభిప్రాయపడ్డారు.

# మారిక రెవెన్యూ అక్రమాలు సరిచేసి గిరిజనులకు న్యాయం చేయాలి

**ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ డిమాండ్**



**వేపాడ, జనవరి, 9 (ఆంధ్రప్రత్రిక) :** మండలంలోని కరకవలస పంచాయతీ శివారు మారిక గిరిశిఖరం పై ఉన్న జిరాతీ భూమికి సంబంధించిన రెవెన్యూ సమస్యలు పరిష్కారం చేయాలని మారికలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జగన్ తో పాటు గ్రామానికి చెందిన గిరిజన నాయకులు సోమేశ్వరరావు, వీర్రాజు ,బాబురావు,అప్పలనాయుడు గ్రామ సదస్సులో మాట్లాడుతూ,శృంగవరపు కోట సబ్ రిజిస్టార్ అక్రమాలపై చర్యలు చేపట్టి గిరిజన రైతులకు న్యాయం చేయకుంటే గిరిజనులు అన్యాయానికి గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. మారికి గ్రామానికి చెందిన గిరిజన రైతులైన పాతబోయిన బుచ్చమ్మ భర్త కన్నయ్యకు చెందిన భూమిని అనంతగిరి మండలం వెలగలపాడు గ్రామానికి చెందిన పాత పోయిన ముత్యాలమ్మ పేరు మీద,బొబ్బిలి దేవన్న తండ్రి కృష్ణమ్మ తాలూకా భూమిని దేవరాపల్లి మండలం కోరాడ గ్రామానికి చెందిన ఇరట దేవుడమ్మ పేరు మీద అక్రమంగా ఆన్లైన్లో ముటేషన్లు చేయించి 12 ఎకరాల భూమిని నానో లిమిటెడ్ ప్రైవేట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ చేయించి ఎమ్మార్వో కార్యాలయంలో ఉన్న అన్ని రికార్డులను మార్పు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.ఇలా భూమికి సంబంధం లేని వ్యక్తులు ఒక కంపెనీ పేరు మీద శృంగవరపుకోట సబ్ రిజిస్టర్ అక్రమ రిజిస్ట్రేషన్లు జరిపి గిరిజన రైతులను నట్టేట ముంచారన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన పేర్లను తొలగించి భూ యజమాని పేరును రికార్డులలో సవరణ నమోదు చేయాలనీ డిమాండ్ చేశారు.అలాగే ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చల్లా జగన్ డిమాండ్ చేశారు.అలాగే సుమారు15 సంవత్సరాల క్రితం 50 ఎకరాల భూమిని ఆరుగురు అమాయక గిరిజనులైన వృద్ధ రైతులను మద్యం తాగించి, పాస్ పుస్తకాలు చేస్తావని నిమ్మబలికి పవర్ ఆఫ్ అటార్ని రాయించుకొని వేరే ఒకరి పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారన్నారు.పై రెండు సందర్భాల్లోనూ గిరిజనులకు అన్యాయం జరిగిందని భూమిపైన, సాగులోను గిరిజనులే ఉన్నారని కానీ రికార్డులలో మాత్రం బయటి వారి పేర్లు ఉన్నాయన్నారు. రెవెన్యూ శాఖ దర్యాప్తు జరిపి సాగులోనే ఉన్న గిరిజన రైతులకు అన్ని హక్కులు కల్పించాలని జగన్ తో పాటు గిరిజన నాయకులు వీర్రాజు, సోమేశ్, బాబురావు,అప్పలనాయుడు తదితరులు రెవెన్యూ సదస్సులో మండల తహసీల్దార్ రాములమ్మకు నివేదించారు.

# సంక్రాంతి బోనస్ పంపిణీ చేసిన హెరిటేజ్ డెయిరీ




**అచ్యుతాపురం, జనవరి 9, (ఆంధ్రప్రత్రిక) :** అచ్యుతాపురం మండలం ఎరుకురెడ్డిపాలెం గ్రామంలో హెరిటేజ్ డైరీకి పాలు సరఫరా చేస్తున్న పాడి రైతు హెరిటేజ్ డైరీ మేనేజర్ కూండ్రపుశేషు 26 పాడి రైతులకు సంక్రాంతి బోనస్ 1.55 లక్షల 55 వేలు రూపాయలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డైరీలో పాలు సరఫరా చేస్తున్న ప్రతి పాడి రైతుకు కృత్రిమ గర్భధారణ రాయితీ పైన రూపాయలు 50/లకే చెయ్యబడును. అదేవిధంగా కృత్రిమ గర్భధారణ (ఆడ దూడ పోట్టేటందుకు) రాయితీ పైన 500 రూపాయలకు చెయ్యబడును. మేనేజర్ కూండ్రపు శేషు మాట్లాడుతూ హెరిటేజ్ డైరీ అన్ని విధాలుగా రైతు కష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంతేకాకుండా హెరిటేజ్ డైరీలో సభ్యత్వం ఉన్న పాడిరైతుకు యాక్సిడెంట్లో మరణించినట్లయితే రెండు లక్షల రూపాయలు, అదేవిధంగా సహజంగా మరణిస్తే అయితే 50 వేల రూపాయలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, రత్నం, పెంటారావు, అప్పలరాజు, నర్సింగరావు, పైడిరాజు, నాగరాజు మొదలైన రైతులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ బత్తుల కుటుంబాన్ని జనపరెడ్డి పరామర్శ



**గోకవరం, జనవరి 9 (ఆంధ్రప్రత్రిక) :** గోకవరం మండలం వెదురుపాక మాజీ సర్పంచ్ బత్తుల నరసింహారావు (బూరయ్య కాపు) మృతి పట్ల గోకవరం మాజీ ఎంపీపీ, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు (బాబు) పరామర్శించారు. ఈసందర్భంగా వెదురు పాకలో మాజీ సర్పంచ్ తనయులు ప్రసాద్, సారంగధరుడు (ఎస్ బాబు), కుమార్తె దంగేటి సూర్యకుమారి (బేబీ) కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా మాజీ మండల టీడీపీ అధ్యక్షులు దొడ్డా విజయ్ భాస్కర్ మాజీ సర్పంచ్ బత్తుల కుటుంబాన్ని పరామర్శించారు. ఈకార్యక్రమంలో బత్తుల మురళి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

Government of Andhra Pradesh
Roads & Buildings Department

SHORT TENDER NOTICE

Inviting short Tender notice for Nit No:-215 of 1 work for an Amount ofRs.1.54 Lakhs in Visakhapatnam District. For more details, visit ap e-procurementonline web portal. ap e-procurement.gov.inLast date & Time for submission of Bids on:16-01-2025 @3.30 P.M.

Date 09/01/2025

Executive Engineer (R&B)
Anakapalli

# ఘనంగా మేలుకొలుపుల సమ్మేళనం



**మునగపాక, జనవరి 9, (ఆంధ్రప్రత్రిక) :** మునగపాక మండలం చూచుకొండ గ్రామంలో గురువారం ఉదయం 5 గంటల నుండి మేలుకొలుపుల బృందాల సమ్మేళనం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనంలో 12 గ్రామాల నుండి మేలుకొలుపుల బృందాలు నుండి సుమారు 600 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్రీయ స్వయంసేవక్ అనకాపల్లి జిల్లా సద్భావనా ప్రముఖ్ పార్థసారథి పాల్గొని మాట్లాడుతూ మేలుకొలుపులు సంక్రమానంలో ఎందుకు చేయాలి, దాని వలన ఉపయోగాలు గురించి తెలియజేశారు. అదేవిధంగా ఉత్తరాంధ్ర జోనల్ ధర్మ ప్రచారక్ గంగాధర్ మాట్లాడుతూ ఎస్ ఎస్ ఎఫ్ ద్వారా జరుగుతున్న పనులు, జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న మేలుకొలుపు ముగింపు కార్యక్రమాలు, విజయవాడలో జరిగిన హైందవ శంఖారావం కార్యక్రమాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ అల్పాహారం చూచుకొండ గ్రామ ప్రజలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం జగన్నాధపురం, మెల్లిపాక, చూచికొండ, గణపర్తి, పరవాడపాలెం, మేలుకొలుపు బృందాలు,బిసిటి కమ్యూనిటీ ఆర్గనైజర్ నాయుడు, జిల్లా ధర్మ ప్రచార క్ శ్రీను, సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వీర మహేష్, గ్రామ పెద్దలు, భజన బృందాల గురువులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ తెలుగు మహాసభలకు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరు



**కోరుకొండ, జనవరి 9 (ఆంధ్రప్రత్రిక) :** తెలుగు భాష ఔన్నత్యాన్నీ ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈతెలుగు మహా సభలు ఎంతగా నో ఉపయోగ పడతాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొ న్నారు.గురువారం రాజానగరం గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ నందు జరుగుతున్న రెండో రోజు ప్రపంచ తెలుగు మహాసభ కార్యక్రమం జక్కంపూడి రాజా పాల్గొన్నారు. జీజీయు చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు వేదికపై మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ, ప్రపంచ తెలుగు మహాసభ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తెలుగు భాషా ప్రాముఖ్యతను నేటి తరానికి తెలియజేయాలని ఉద్దేశంతో ఈమహాసభలను మన ప్రాంతాల్లో నిర్వహించేందుకు ఎంతగానో కృషి చేసిన జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్య నారాయణరాజును ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

దేవాదాయ - ధర్మదాయశాఖ
షాపు లీజు హక్కు ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా - కోరుకొండ మండలం - కోరుకొండ గ్రామం నందు శ్రీ విరియాల వెంకటరెడ్డి పంతులు గారి సత్రంనకు షాపుకు నెలసరి అద్దెకి లీజు హక్కులను 3 సం॥ కాలమునకు సత్రం ఆఫీసు వద్ద ది. 21-01-2025 తేది మంగళవారం ఉదయం 10 గం॥లకు దేవాదాయశాఖ అధికారుల సమక్షమున, బహిరంగ వేలం పాటలు నిర్వహించబడును. కావున ఆశక్తి గలవారు పాటలో పాల్గొనుటకు వీలుగా ఈప్రకటన జారి చేయడమైనది.

కోరుకొండ
09-01-2025

గండి. వెంకటలక్ష్మి కుమార్
కార్యనిర్వహణ అధికారి గ్రేడ్ -1

షరా : పూర్తి వివరములు కొరకు సంబంధిత రెవెన్యు కార్యలయము - నోటీసు బోర్డు నందు ప్రకటన కొరకు అంటించిన కరపత్రము ద్వారా తెలుసుకోనవలెను.

# మోడీ విశాఖ పర్యటన సందర్భంగా అక్రమ అరెస్టులు, లాఠీచార్జిలు, గృహనిర్బంధాలుకు వ్యతిరేకంగా సిపిఎం నిరసన




**అచ్యుతాపురం, జనవరి 9, (ఆంధ్రప్రత్రిక) :** బుధవారం విశాఖపట్నంలో మోడీ పర్యటన సందర్భంగా అనకాపల్లి జిల్లాలో సిపిఎం నాయకులు ఇళ్ల వద్ద రెండు రోజులుగా ప్రభుత్వం గృహనిర్బంధాలు, అక్రమ అరెస్టులకు పాల్పడడం జరిగింది. దీనిని నిరసిస్తూ గురువారం అచ్చుతాపురంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం అచ్చుతాపురం కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ విశాఖ సాక్షిగా మోదీ మరోసారి ద్రోహం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణ, సొంత ముడి ఇనుప గనులు కేటాయింపు, కాపిటల్ రీ స్ట్రచ్చరింగ్ కు 18 వేల కోట్లు పై ప్రధాని ప్రకటన చేయక పోవటం విశాఖకు, ఉత్తరాంధ్రకు మరో సారి ద్రోహం చేయడమే. రాష్ట్ర ముఖ్యమంత్రి కనీసం విశాఖ స్టీల్ ప్లాంట్ పై ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఆర్శిలార్ మిట్టల్ స్టీల్ కి అవసరమైన ముడి ఇనుప గనుల సరఫరా, ఇతర అనుమతులు గురించి సాగిల పడి మాట్లాడటం విశాఖ స్టీల్ ప్లాంట్ కి ద్రోహం చేయడమే. కేంద్ర బీజేపీ, రాష్ట్ర టిడిపి, జనసేన కూటమి కలిసి విశాఖ స్టీల్ ప్లాంట్ ను మిట్టల్ కి బలిచ్చేలా కుట్ర పన్నినట్టు ఈ రోజు మోడీ బహిరంగ సభతో తేలిపోయింది. దీనికి టీడీపీ, జనసేన కూటమి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని గతంలో వ్యతిరేకించిన బల్క్ డ్రగ్ పార్కును నేడు శంకుస్థాపనలు చేయడం విడ్డూరంగా ఉంది. విదేశాల్లో నిషేధించిన ఫార్మ పరిశ్రమలను ఈ ప్రాంతంలో పెట్టి అనకాపల్లి జిల్లాలో పర్యావరణాన్ని ,ప్రజల ఆరోగ్యాలను పణంగా పెడుతుంది. ఇటువంటి కాలుష్య కారక పరిశ్రమలను నిర్మించే విధానాన్ని విరమించుకోవాలని, పూడిమడక ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ 1200 ఎకరాల్లో భూములు కోల్పోయిన నిర్వాసితుల మత్స్యకారులకు శాశ్వత ఉపాధి కల్పనకు ఎటువంటి హామీ ఇవ్వలేదు, హైడ్రోజన్ ప్లాంట్ ఉత్పత్తి ఏ విధంగా తయారు చేస్తారో సమగ్రంగా తెలుపలేదు, విభజన హామీలు ప్రత్యేక హోదా వంటి హామీలు నేటికీ అమలు కాలేదు నేటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా అనుకూల విధానాలు అవలం బించకపోతే గత ప్రభుత్వాలు పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె .సోము నాయుడు, తట్టా రాజు, గణేష్, వెంకట్, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

**ఆకట్టుకున్న పిల్లల వేషధారణలు**

**ఉత్సాహభరితంగా పాల్గొన్న పిల్లలు ఉపాధ్యాయులు**



**వేపాడ, జనవరి, 9 (ఆంధ్రప్రత్రిక) :** మండలంలోని బల్లంకి,చామలాపల్లి ప్రాధమిక పాఠశాలలలోను, సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోను, బక్కునాయుడుపేటలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలోను ముందస్తు సంక్రాంతి సంబరాలు గురువారం అంబరాన్నంటాయి.ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్డులు సంక్రాంతి సంబరాలలో ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్డులు సనాతన సాంప్రదాయాల పరిచయంలో భాగంగా రంగోలి, భోగిమంట, హరిదాసు,గంగిరెద్దు వేషధారణలు వేసి విద్యార్డులు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నారు. అలాగే సంక్రాంతి శోభలో బాగంగా ఆయా పాఠశాలలకు చెందిన చిన్నారులు తెలుగింటి ఆడపడుచుల మాదిరిగా చీరకట్టు,పూలజెడలతో అందరినీ ఆకట్టుకున్నారు.అలాగే భోగి మంటల వద్ద పాటలు పాడడం,ఆకర్షణీయంగా రంగవల్లులు వేయడం,రంగు రంగుల పతంగులను ఎగురవేసి సంక్రాంతి పండుగ విశిష్టతను చాటారు.అలాగే సోంపురం హైస్కూలు విద్యార్డులు తిరుచిరాపల్లిలో జరగనున్న జాతీయ జంబోరీలో పాల్గొనబోవు సేవాశ్రీ స్కౌట్ యూనిట్ మరియు రుద్రమదేవి గైడ్ యూనిట్ ల ఆద్వర్యంలో థింసా, కోలాటం తదితర సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు బిపిఎ రాజు, సన్యాసిరావు, గోవిందరావు,బ్రిడ్జి స్కూలు ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్,వైస్ ప్రిన్సిపాల్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.





## వెంకటేశ్వర స్వామి దేవాలయంలో

# ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లను పూర్తి

**అనకాపల్లి జనవరి 9 (ఆంధ్రప్రత్రిక) :** ముక్కోటి ఏకాదశి పర్వదిన సందర్భంగా దేమునిగుమ్మం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కూటమి నాయ కులు బొలిశెట్టి శ్రీనివాసరావు, సకలా గోవిందరావు, దూలం గోపి. ఏర్పాట్లను పరిశీలించారు, ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాసరావు,సకలా గోవిందరావు మాట్లాడు తూ, ఎంతో ప్రసిద్ధిగాం చినటువంటి దేము నిగుమ్మం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశి పర్వదినం సం దర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకూడదనే ఉద్దేశంతో శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాలతో జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ సూచనలతో ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందని తెలిపారు. కార్య నిర్వహణాదికారి టి రాజ సులోచన మాట్లాడుతూ, గురువారం రాత్రి తెల్లవారితే శుక్రవారం అనగా రెండు గంటల 30 నిమిషాలకు స్వామివారి సుప్రభాత సేవ నిత్యర్చన అనంతరం ఉత్తర ద్వార దర్శనం గుండా అయోధ్య బాలరాముడు దర్శనం జరుగుతుందని తెలిపారు, ఈ సమావేశంలో దేవాలయం ప్రధాన అర్చకులు పులఖండం గిరిబాబు పులకండం ప్రసాద్ బాబు, జగన్నాథ స్వామి దేవస్థానం చైర్మన్ దాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి నేతల ఆరోపణలు అవాస్తవం

(మొదటిపేజీ తరువాయి)

ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నారంటూ బీజేపీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. న్యూఢిల్లీతోపాటు మరో స్థానం నుంచి కేజ్రీ పోటీ చేయబోతున్నారంటూ బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై కేజ్రీవాల్ తాజాగా స్పందించారు. బీజేపీ నేతల ఆరో పణలను ఖండించారు. తాను కేవలం ఒక్క స్థానం నుంచే పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కాగా, న్యూ ఢిల్లీ స్థానం నుంచి కేజ్రీ వరుసగా నాలుగోసారి పోటీకి సిద్ధమయ్యారు. ఈ స్థానం నుంచి కేజ్రీవాల్‌పై బీజేపీ తరఫున మాజీ ఎంపీ పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్నారు. మరోవైపు 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు 67, 62 స్థానాలతో ఆప్ క్లీన్ స్వీప్ చేసింది. హ్యాట్రిక్ విక్టరీతో మూడోసారి అధికారంలోకి రావాలని ఆ పార్టీ భావిస్తున్నది. 70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనున్నది. ఫిబ్రవరి 8న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

# ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

క్రమంలో అక్కడ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు నక్సలైట్లు హతమయ్యారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసా గుతున్నట్లు సుక్మా ఎస్పీ కిరణ్ చావన్ తెలిపారు. కాగా, మూడు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడిన విషయం తెలిసిందే. జవాన్ల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులకు పేలుళ్లకు పాల్పడ్డారు. బీజాపూర్ జిల్లా భేద్రే కుట్రు రహదారిలో ఐఈడీ పేలుళ్లకు మావోయిస్టులు పాల్పడ్డారు. ఐఈడీ పేలిన సమయంలో పోలీసుల వాహనంలో 15 మంది డీఆర్‌జీ జవాన్లు ఉన్నారు. ఈ దుశ్చర్యలో 8 మంది జవాన్లతో పాటు డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి.

# రెండో రోజూ నష్టాల్లో సూచీలు..

(మొదటిపేజీ తరువాయి)

ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఇది మన మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా నష్టంతో 78 వేల దిగువకు చేరగా. నిఫ్టీ సైతం 23,600 స్థాయిని కోల్పోయింది. బీఎస్ ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ గడిచిన రెండు సెషన్లలో దాదాపు రూ.7 లక్షల కోట్లు క్షీణించి రూ.435 లక్షల కోట్లకు పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 78,206.21 పాయింట్ల (క్రితం ముగింపు 78, 148.49) వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో దాదాపు 600 పాయిట్ల నష్టోయిన సూచీ.. 77, 542.92 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 528.28 పాయింట్ల నష్టంతో 77, 620.21 వద్ద ముగిసింది. నిఫ్టీ 162.45 పా యింట్ల నష్టంతో 23,526.50 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 3 పైసలు క్షీణించి 85.88గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, జొమాటో, ఎల్అండ్, టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2682 డాలర్లకు చేరింది.

# సుప్రీంలో కెటిఆర్‌కు చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

పిటిషన్‌ను శుక్రవారం విచారణకు తీసుకునేందుకు చీఫ్ జస్టిస్ నిరాకరించారు. ఈనెల 15న సుప్రీంలో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగనుంది. 15వ తేదీన విచారణకు లిస్ట్ చేసినందున అదే రోజు విచారిస్తామని సీజే స్పష్టం చేశారు. అప్పటి దాకా కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను విచారించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు... కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన విషయం తెలిసిందే. అలాగే మధ్యంతర ఉత్తర్వులను కూడా హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో కేటీఆర్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అత్యవసరంగా విచారణకు తీసుకోవాలని కేటీఆర్ తరపు న్యాయవాదులు కోరినప్పటికీ సుప్రీం కోర్టు సీజేఐ నిరాకరించారు. హైకోర్టులో క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన వెంటనే సుప్రీం కోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అయితే దాన్ని అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదంటూ 15 విచారణ జరుపుతామంటూ ఆరోజు లిస్ట్ చేశారు. అయితే ఈరోజు కేటీఆర్ తరపు న్యాయవాదులు సీజేఐ ధర్మాసనం ముందు హాజరై.. ఇది చాలా సున్నితమైన అంశమని.. కేటీఆర్ అరెస్ట్ అయ్యే అవకాశం ఉన్నందున్న ఈరోజు లేదా రేపు విచారణ జరపాలని కేటీఆర్ న్యాయవాదు కోరారు. అయితే ఇది అంత అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదని అభిప్రా యపడుతూ ఈనెల 15న విచారణకు లిస్ట్ చేసినందున ఇక ఆరోజే విచారస్తామని సంజీవ్ కన్నా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

# తిరుపతి ఘటన..

(మొదటిపేజీ తరువాయి)

ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో చాలా మంది మరణించారని తెలిసి బాధపడ్డాను. మృతుల కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయ పడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని రాష్ట్రపతి ముర్ము ఎక్స్ పై ఒక పోస్ట్‌లో తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తిరుపతి తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోవడం పట్ల సంతాపం తెలిపారు. ఈ మేరకు ఎక్స్ పై ఒక పోస్ట్‌లో ప్రధానమంత్రి కార్యాలయం ఇలా పేర్కొంది. 'ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో జరిగిన తొక్కిసలాట బాధాకరం. తమ సన్నిహి తులను మరియు ప్రియమైన వారిని కోల్పోయిన వారి పట్ల నా సానుభూతి. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని నేను ప్రార్థిస్తున్నాను. బాధితులకు ఏపీ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తోంది.' అని పేర్కొన్నారు. తిరుమల కొండలపై వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్ల కోసం బుధవారం రాత్రి వందలాది మంది భక్తులు పోటీ పడుతుండగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించగా, డజన్ల కొద్దీ మంది గాయపడ్డారు.

# టీటీడీలో ప్రక్షాళన జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

సిమ్స్ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. ఘట నాస్థలంలో జరిగిన సంఘటనలు గురించి ఆరాదీశారు. టీటీడీలో పూర్తి పక్షాళన జరగాలని, మనుషులు చనిపోయినప్పటికీ కూడా పోలీసులు బాధ్యత యుతంగా ప్రవర్తించలేదని ఆరోపించారు. టీటీడీ ఈవో శ్యామల రావు, అడిషన్ ఈవో వెంకయ్య చౌదరిల మధ్య సమన్వయ లోపం ఏర్పడిందని వారు శ్రద్ధ కైకొని వీఐపీలకంటే భక్తులకు మెరుగైన సేవలు అందించాలని పవన్ కళ్యాణ్ హితవు పలికారు. ఇది చూస్తుంటే పోలీసులను అడ్డుపెట్టుకొని కుట్ట జరిగిందని అనుమానం వస్తుందని అన్నారు.

# మాజీ సిఎం జగన్‌కు గుడ్‌న్యూస్

(మొదటిపేజీ తరువాయి)

అనుమతిచ్చింది. ఈనెల 11 నుంచి 30వ తేదీ వరకు జగన్ యూకేలో పర్యటించనున్నారు. అక్రమాస్తుల కేసులో నిందితుడిగా ఉన్న జగన్ విదేశాలకు వెళ్లడానికి సీబీఐ కోర్టు అనుమతి తీసుకోవాలని గతంలో నాంపల్లి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది మే 16వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ మధ్యలో లండన్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ దేశాల్లో ఆయన పర్యటించి వచ్చారు. అనంతరం తన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 3 నుంచి 25వ తేదీ వరకు యూకే వెళ్లేందుకు సీబీఐ అనుమతి కోరగా కోర్టు అభ్యంతరం వ్యక్తం చేయడంతో తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. తాజాగా మూడోసారి సీబీఐకి అనుమతిని కోరుతూ దరఖాస్తు చేసుకోగా కుటుంబసమేతంగా విదేశాలకు వెళ్లేందుకు న్యాయస్థానం అంగీకారం వ్యక్తం చేసింది.

# నిజ్జర్ హత్య కేసులో నలుగురికి ఊరట

### బెయిల్ మంజూరు చేసిన కోర్టు

**న్యూఢిల్లీ,జనవరి 9 :** ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఘటనలో అరెస్టయిన నలుగురికి బెయిల్ మంజూరయ్యింది. ఈ హత్యా ఘటన తరవాత భారత్, కెనడా ల మధ్య దౌత్య విభేదాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన టొరంటో పోలీసులు.. గతేడాది నలుగురు భారతీయులను నిందితులుగా పేర్కొంటూ అరెస్టు చేశారు. తాజాగా వారికి బెయిల్ మంజూరైంది.నిజ్జర్ కేసులో ఫస్ట్ డిగ్రీ అభియోగాలపై కరణ్ బ్రార్, కమల్ ప్రీత్ సింగ్, కరణ్ ప్రీత్ సింగ్, అమర్‌దీప్ సింగ్‌ను గతేడాది మే నెలలో కెనడా పోలీసులు అరెస్టు చేశారు. భారత్‌కు చెందిన వీరిలో ముగ్గురు ఎడ్మంటర్ ప్రాంతంలో నివసిస్తుండగా.. అమర్‌దీప్ బ్రాంప్టన్ వాసి. గత కొన్ని నెలలుగా జైల్లో ఉన్న వీరికి కెనడాలోని దిగువ కోర్టు తాజాగా బెయిల్ మంజూరుచేసింది. అనంతరం ఈ కేసు విచారణను బ్రిటీష్ కొలంబియా సుప్రీంకోర్టుకు బదిలీ చేస్తున్నట్లు తెలిపింది. దీనిపై ఫిబ్రవరి 11న తదుపరి విచారణ జరగనుంది. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ 2023 జూన్‌లో బ్రిటీష్ కొలంబియాలోని సర్రే ప్రాంతంలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటన వెనక భారత ఏజెంట్ల హస్తం ఉందంటూ అప్పట్లో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. వాటిని సమర్థించే ఆధారాలు ఇవ్వాలని.. ఆ తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని పలుమార్లు స్పష్టంగా చెప్పింది. అయినప్పటికీ కెనడా మాత్రం ఆరోపణలు చేయడం మానలేదు. ఈక్రమంలోనే నిజ్జర్ హత్య కేసు అనుమానితుల జాబితాలో భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్ వర్మ పేరును చేర్చడంతో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సంజయ్‌వర్మ సహా ఆ దేశంలోని మన దౌత్యవేత్తలను భారత్ వెనక్కి రప్పించింది. అదే సమయంలో దిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించాలన్న నిర్ణయం తీసుకుంది. దీంతో ఒట్టావా కూడా మన దౌత్యవేత్తలపై బహిష్కరణ వేటు వేసింది.

# క్షతగాత్రులకు చంద్రబాబు పరామర్శ

(మొదటిపేజీ తరువాయి)



సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలంటూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భక్తులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. అలాగే గతానికి.. ఇప్పటికి ఉన్న తేడా ఏమిటని ఈ సందర్భంగా భక్తులను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఎలా చేస్తే బాగుండేదని కూడా ఆరా తీసారు. దీంతో ప్రస్తుత విధానం తప్పని, కొండపైన క్యూలన్లలో ఉంటేనే మేలని పలువురు సూచించారు. అదే విధంగా ఈ ఘటన గల కారణాలపై భక్తుల నుంచి ఆయన మరింత సమాచారాన్ని సేకరించారు. తిరుపతిలో తాము ఉన్న ప్రదేశంలో కనీసం లైట్లు కూడా లేవని ఈ సందర్భంగా సీఎం దృష్టికి భక్తులు తీసుకు వెళ్లారు. గేట్ తీయ్యడంతో ఒక్క సారిగా భక్తులు లోపలికి చొచ్చుకు రావడంతోనే తోపులాట జరిగిందంటూ సీఎంకు భక్తులు వివరించారు. శ్రీవారి దర్శనానికి ఎలాంటి సిస్టం పెడితే బాగుంటుంది అనే విషయాలను భక్తులను ఆయన అడిగి.. వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. అయితే.. తమకు స్వామి వారి దర్శనం కల్పించాలని ఈ సందర్భంగా పలువురు భక్తులు.. సీఎం చంద్రబాబుని కోరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భక్తులందరికీ వైకుంఠ ద్వారా దర్శనం కల్పిస్తామని ఈ సందర్భంగా వారికి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. తిరుమలలో శ్రీవారి దర్శనానికి.. భక్తులందరికి ఆమోద్య యోగ్యంగా వుండే విధానాన్ని ప్రవేశపెడతామని భక్తులకు ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. జనవరి 10వ తేదీన ముక్కోటి ఏక దశి. ఈ సందర్భంగా తిరుపతిలోని శ్రీవారి ఆలయంతోపాటు దేశంలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేస్తారు. ఆ క్రమంలో తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం తిరుపతిలో టోకెన్లు జారీ చేసేందుకు టీటీడీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ టోకెన్లు తీసుకొనేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తిరుపతి చేరుకున్నారు. ఆ క్రమంలో బుధవారం తిరుపతిలో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మరణించగా.. 40 మందికిపైగా గాయపడ్డారు. దీంతో క్షతగాత్రులు తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

# తొక్కిసలాట ఘటనపై చంద్రబాబు విచారం

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు. 'డీఎస్పీ రమణ కుమార్ బాధ్యత లేకుండా పనిచేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన రమణ కుమార్, గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డిని సస్పెండ్ చేశాం. ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఎస్‌వో శ్రీధర్‌ను తక్షణమే బదిలీ చేస్తున్నాం. ఘటనపై న్యాయ విచారణ జరిపిస్తాం అని ప్రకటించారు. తితిదే ద్వారా మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తాం. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తాం. తిమ్మక్క, ఈశ్వరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి రూ.5 లక్షల చొప్పున సాయం చేస్తాం. గాయపడిన 33 మందికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున పరిహారం అంది స్తాం. బాధలో ఉన్నప్పటికీ స్వామివారి దర్శనం చేసుకోవాలనే సంకల్పం వారిలో ఉంది. 35 మందికి శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం చేయిస్తాం' అని చంద్రబాబు తెలిపారు. ఇకపోతే తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి టోకెన్ల జారీ కౌంటర్ల వద్ద జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది.. ఈ ఘటనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీర్ణించుకోలేక పోతున్నారు.. ఘటనపై ఆరా తీసినప్పటి నుంచి సమీక్ష సమావేశం వరకు అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడుతూనే ఉన్నారు.. టోకెన్ల కోసం వచ్చి తొక్కిసలాటలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం.. ఇంకా కొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా.. బాధితులను పరామర్శించిన సీఎం చంద్రబాబు.. ఆ తర్వాత టీటీడీ పరిపాలన భవనంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. తొక్కిసలాట ఘటనతో పాటు రేపటి వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై కూడా చర్చించినట్టుగా తెలుస్తుండగా.. ఈ సమావేశంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకన్న చౌదరీ, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులు, ఎస్పీ సుబ్బారాయుడు, మంత్రులు సత్యకూమార్, నిమ్మల, ఇతర అధికారులు పాల్గొన్నారు.. తొక్కిసలాట సహా జరిగిన ఘటనలపై 40 నిమిషాలకుపైగా చర్చించారు..అయితే, టీటీడీ ఉన్నాధికారుల తీరుపై చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు .. సమీక్షలో టీటీడీ ఈవోపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.. అజాగ్రత్తగా ఉండడం వల్లే ఇంతటి దుర్ఘటన జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు.. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)ని ప్రక్షాళన చేస్తానన్న నమ్మకంతోనే ప్రజలు మాకు ఓట్లు వేశారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయబోమన్నారు.. అసలు దర్శన టోకన్ల కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఎందుకు పెట్టలేదు..? అని సమావేశంలో నిలదీశారు.. మరోసారి ఇలాంటి ఘటనలు జరిగితే ఏ మాత్రం సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు.

# ఇస్రో స్పేడెక్స్ మిషన్‌లో ఆ ప్రక్రియ మళ్లీ వాయిదా

**న్యూఢిల్లీ,జనవరి 9 :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చేపట్టిన స్పేడెక్స్ మిషన్‌లో వ్యోమనౌకల అనుసంధాన ప్రక్రియ మళ్లీ వాయిదాపడింది. ఇస్రో ఇటీవల రీషెడ్యూల్ చేసిన ప్రణాళిక ప్రకారం.. ఈ ప్రక్రియ ఇవాళ ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఉపగ్రహాల మధ్య దూరం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో అనుసంధాన ప్రక్రియను మరోసారి వాయిదా వేసినట్లు ఇస్రో ప్రకటించింది. ఇస్రో రెండు ఉపగ్రహాల మధ్య దూరాన్ని 500 నుంచి 225 మీటర్లకు తగ్గించేందుకు ఓ ప్రయోగం నిర్వహించింది. అయినా రెండు శాటిలైట్స్ మధ్య దూరం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో మరోసారి స్పేడెక్స్ డాకింగ్‌ను వాయిదా వేసింది. ఈ విషయాన్ని ఇస్రో తన సోషల్ మీడియా ప్లాట్?ఫామ్ ఎక్స్ ద్వారా వెల్లడించింది. ప్రస్తుతం రెండు ఉపగ్రహాలు సురక్షితంగా ఉన్నాయని తెలిపింది. అయితే ఈ డాకింగ్‌ప్రక్రియ రీషెడ్యూల్ తేదీని మాత్రం ప్రకటించలేదు. మొదట స్పేడెక్స్ మిషన్‌లో డాకింగ్ ప్రక్రియను జనవరి 7న నిర్వహించేందుకు ఇస్రో ప్లాన్ చేసింది. అయితే మిషన్‌లో కొన్ని సాంకేతిక అవరోధాలు తలెత్తడంతో జనవరి 9వ తేదీకి రీషెడ్యూల్ చేసింది. ఇవాళ కూడా



డాకింగ్ సాధ్యపడకపోవడంతో మరోసారి రీషెడ్యూల్ చేయాల్సి వచ్చింది. కాగా ఇస్రో 2024 డిసెంబర్ 30న రాత్రి 10:00:15 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) ప్రయోగాన్ని చేపట్టింది.

# అమల్లోకి వచ్చిన భూభారతి చట్టం

**హైదరాబాద్,జనవరి 9 (ఆంధ్రపత్రిక):** 'భూ భారతి-2024' చట్టానికి గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. దీంతో ఇది చట్టరూపం దాల్చింది. గవర్నర్ ఆమోదం తెలపటంతో వీలైనంత త్వరగా చట్టాన్ని అమల్లోకి తెస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. గవర్నర్ ఆమోదించిన భూ భారతి చట్టం బిల్లు కాపీని సచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ మంత్రి పొంగులేటికి అందజేశారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. చరిత్రాత్మక భూ భారతి చట్టాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదించడంతో వీలైనంత త్వరగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఈ చట్టాన్ని రూపొందించామని పేర్కొన్నారు. ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరి అభిప్రాయాలను క్రోడీకరించి సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ చట్టానికి సంబంధించిన విధివిధానాలను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. డిసెంబర్ 20వ తేదీన భూభారతి బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన విషయం తెలిసిందే. అనంతరం డిసెంబర్ 30వ తేదీన గవర్నర్ కార్యాలయానికి భూభారతి బిల్లు చేరింది.

# నష్టపోయిన పంట వివరాలపై కేంద్రానికి నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

గురువారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి పెరిన్ దేవి నేతృత్వంలోని కేంద్ర బృందంతో సమావేశమై రాష్ట్రంలో కరువు పరిస్థితులను వివరించారు.కేంద్రబృందం సభ్యులు సుప్రియా మాలిక్, డిప్యూటీ డైరెక్టర్,డిపార్ట్మెంట్ ఆఫ్ ఎక్సపెండిచర్ అనురాధ బట్నా సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్, నీతి ఆయోగ్., డా. దీపాంకర్ సేథ్, అసిస్టెంట్ కమిషనర్, పశు సంవర్ధక శాఖ., డా.ప్రదీప్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్,వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ., శ్రీ.మన్నూజీ ఉపాధ్యాయ్, డైరెక్టర్, సెంట్రల్ వాటర్ కమిషన్., జయంతి,అండర్ సెక్రటరీ, గ్రామీణ అభివృద్ధి శాఖ., డా. కె. పొన్నుస్వామి, డైరెక్టర్, ఆయిల్ సీడ్స్ డెవలప్మెంట్ ఈ మేరకు వ్యవసా య శాఖ డైరెక్టర్ శ్రీ డిల్లీరావు, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్, ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో భేటీయై చర్చిం చారు.ఈ సందర్భంగా ప్రభుత్వ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా మాట్లా డుతూ.. రాష్ట్రంలో కరువు పరిస్థితులను కేంద్ర బృందానికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు జిల్లాల్లోని 54 మండలాలు (అన్నమయ్య- 19, చిత్తూరు-16, శ్రీ సత్య సాయి- 10, అనంతపురం - 7 మరియు కర్నూలు - 2) ఇప్పటికే ప్రకటించడం జరిగింది. వాటిలో 27 తీవ్ర కరువు మండలాలు, 27 మధ్యస్థ కరువు మండలాలు. కేంద్ర కరువు మాన్యువల్ ప్రకారం సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం, వర్షాభావంతో అత్య ధిక డ్రైస్పెల్స్, రిమోట్ సెన్సింగ్, సాయిల్ మోయిశ్చర్, హైడ్రాలజీ, పంట నష్టం 33% అంతకంటే ఎక్కువ ఉన్న మండలాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం కరువు ప్రాంతాలను ప్రకటించిందని అన్నారు.కరువు ప్రభావంతో పత్తి, జొన్న, వేరుశెనగ, ఎర్ర శనగలు, మొక్కజొన్న మొదలైన 14 రకాల పంటలు దెబ్బతిని ఐదు జిల్లాల్లోని 1.06 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 1.44 లక్షల మంది రైతులు నష్టపోయారని తెలిపారు.వ్యవసాయ శాఖ ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రూ. 90.62కోట్లు, రూరల్ వాటర్ సప్లై రూ. 0.78 కోట్లు, అర్బన్ వాటర్ సప్లై రూ. 4.89 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.55.47 కోట్లు ఆర్థిక సహాయం అవసరమన్నారు. క్షేత్రస్థాయిలో కరువు నష్టానికి సంబంధించి వాస్తవిక వివరాలను అందించామని, రైతులను ఆదుకోడానికి సత్వరమే రూ. 151.77 కోట్లు సాయం చేయాలని కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పీఆర్ ఆర్డి, పశు సంవర్ధక శాఖ, ఆర్ డబ్ల్యూఎస్,పబ్లిక్ హెల్త్,అనుబంధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# అత్యున్నత విచారణ జరిపించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే ఘటనా స్థలిని పరిశీలించారు. పవన్, జగన్ తిరుపతి వస్తున్నారు. ఈ ఘటన పైన కేసులు నమోదు అయ్యాయి. ఆరుగురు మరణించటం పైన భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీటీడీ అధికారుల పై చర్యలకు డిమాండ్ చేస్తు న్నారు. ఇదే సమయంలో రాజకీయ పార్టీలు మరణించిన వారికి పరిహారం పెంచాలని కోరుతున్నాయి. ఇక, మొన్న లడ్డు కల్తీ.. నేడు తొక్కిసలాట ఘటనలతో అసలు ఏం జరు గుతోందనే చర్చ మొదలైంది. టీటీడీపై విమర్శలు తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. పెద్ద సంఖ్యలో క్షతగాత్రులు అయ్యారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ 25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. కాసేపట్లో పవన్, జగన్ తిరుపతి చేరుకుంటారు. ఈ ఘటనపైన పీసీసీ చీఫ్ షర్మిల కీలక వ్యాఖ్యలు చేసారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం వెళ్తే ఏకంగా వైకుంఠానికే పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. గోవింద నామాలు ప్రతిధ్వనించాల్సిన చోట ఘోరమైన మృత్యుఘోష వినిపిస్తోందని మండిపడ్డారు. లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసి కూడా కనీస ఏర్పాట్లు చేయకపోవడం పాలన యంత్రాంగం వైఫల్యానికి నిదర్శ నమని ఫైర్ అయ్యారు. ఆరుగురు భక్తులు చనిపోయిన ఘటనపై నైతిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం వహించాలని షర్మిల పేర్కొన్నారు. చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం అన్యాయమని చెప్పుకొచ్చారు. ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ప్రకటించాలని షర్మిల డిమాండ్ చేసారు. వారి ఇంట్లో అర్హులు ఉంటే ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీఎం చంద్రబాబును కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మొన్న లడ్డు కల్తీ.. నేడు తొక్కిసలాట ద్వారా కోట్లాది హిందువుల ఆరాధ్య దేవుడు, కలియుగ దైవం వెంకన్న క్షేత్రానికి మచ్చ తెచ్చి పెట్టాయని షర్మిల వ్యాఖ్యానించారు. తొక్కిసలాట ఘటనపై వెంటనే అత్యున్నత విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని షర్మిల ప్రభుత్వాన్ని కోరారు.

# మోహన్‌బాబుకు సుప్రీంలో ఊరట

### - బెయిల్ విచారణ ముగిసేవరకు అరెస్ట్ చేయొద్దని ఆదేశం



**హైదరాబాద్,జనవరి 9 (ఆంధ్రపత్రిక):** సినీనటుడు, దర్శక, నిర్మాత మంచు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ముందస్తు బెయిల్ పై విచారణ జరుగుతోందని, ఆ విచారణ ముగిసేంతవరకు మోహన్‌బాబును అరెస్ట్ చేయవద్దని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. జర్నలిస్టుపై దాడి కేసులో మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసుపై ముందస్తు బెయిల్ మంజూరుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. దీంతో ఆయన ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై గురువారం జస్టిస్ సుధాంశు ధులియా నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో మోహన్‌బాబు ముందస్తు బెయిల్‌పై విచారణ పూర్తయ్యే వరకు ఆయనను అరెస్టు చేయవద్దంటూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. మోహన్ బాబు బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జర్నలిస్ట్ పై దాడి కేసులో ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ మోహన్ బాబు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తన వయసు 78 ఏళ్లని, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నానని అందుచేత తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ క్రమంలో సుప్రీం కోర్టు నుంచి తనకు సానుకూల తీర్పు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆయన అనుకున్నట్టుగానే గురువారం విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

# భవిష్యత్ యుద్ధంలో కాదు..బుద్ధుడిలో ఉంది..

(మొదటిపేజీ తరువాయి)

టూరిస్టుల కోసం ఈ రైలును స్టార్ట్ చేశారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ నుంచి ఈ రైలు బయలుదేరింది. మూడు వారాల జర్నీ ఉంటుంది. దేశంలోని పలు సంప్రదాయ, మత పరమైన ప్రదేశాలను ఆ రైలు చుట్టివస్తుంది. ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్‌ను.. ప్రత్యేక టూరిస్టు రైలును రూపొందించారు. విదేశాల్లో ఉన్న భారతీయుల కోసం ఈ టూరిస్టు రైలు కాన్సెప్ట్‌ను డెవలప్ చేశారు. 45 ఏండ్ల నుంచి 65 ఏండ్ల మధ్య ఉన్నవారు ఈ రైలులో ప్రయాణం చేయవచ్చు. తమ చారిత్రాత్మక మూలాలను టచ్ చేసే రీతిలో ఈ రైలు రూట్‌ను క్రియేట్ చేశారు. ఢిల్లీ నుంచి బయలుదేరిన రైలు.. ఆ తర్వాత అయోధ్య చేరుకుంటుంది. అక్కడ నుంచి పాట్నా, గయా, వారణాసి, మహాబలిపురం, రామేశ్వరం, మధురై, కొచ్చి, గోవా, ఎక్తా నగర్(కేవడియా), అజ్మీర్, పుష్కర్, ఆగ్రా పట్టణాలను ఆ రైలు చుట్టువస్తుంది. ఈ రైలులో 156 మంది ప్రయాణికుల ట్రావెల్ చేసే అవకాశం ఉంటుంది. విదేశాంగ శాఖ, భారతీయ రైల్వే, ఐఆర్సీటీసీ కలిసి .. ప్రవాసీ రైలును స్టార్ట్ చేశారు. వివిధ దేశాల్లోని భారతీయ ఎంబసీల నుంచి ఈ రైలు ప్రయాణికుల కోసం దరఖాస్తు చేశారు. తక్కువ ఆదాయం ఉన్న వారికి ఈ రైలులో ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నారు. విదేశాంగ శాఖ ప్రకారం.. రైలు టూరుకు చెందిన అన్ని ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఆయా దేశాల నుంచి ఇండియాకు వచ్చే ప్రవాసీల రిటర్న్ విమాన ఖర్చులో 90 శాతం కూడా ప్రభుత్వమే పెట్టుకోనున్నది. ప్రయాణికులు కేవలం 10 శాతం ఛార్జీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ రైలులో టూర్ చేసే వారికి 4స్టార్ హొటల్ అకామిడేషన్ ఇవ్వనున్నారు. రైలు ఆవిష్కరణ గురించి మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఓ ట్వీట్ చేశారు.

# వక్ఫ్ బోర్డులో ఒకే ఒకడు...



- ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా గుర్తింపు..
- అవినీతి అక్రమాలకు అతడే ఒక బ్రేక్..
- ముక్కు సూటితనానికి ఉదాహరణ..
- వక్ఫ్ అక్రమార్కులకు సింహ స్వప్నం..

**గుంటూరు,జనవరి 8 (ఆంధ్రపత్రిక):** గుంటూరు జిల్లా అనగానే ఠక్కున గుర్తుకొచ్చేది మిర్చి అయితే అనేక వివాదాలకు ఎప్పుడు కేర్ ఆఫ్ గా ఉండే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డులో మాత్రం పై అధికారులకు సమస్యాత్మక సందర్భాలు ఎదురైనప్పుడు ఠక్కున గుర్తుకు వచ్చే అధికారి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ తరహాలో వివాదాస్పద వక్ఫ్ సంస్థలను గాడిలో పెట్టడానికి వక్ఫ్ బోర్డు సంధించే అస్త్రమే షేక్ మొహమ్మద్ హుస్సేన్.

ఇతగాడు ఎక్కడ పని చేసిన తనదైన మార్కు వేయడంలో దిట్ట. దానికి గాను అవినీతి అక్రమార్కులు అతని పై అనేక రకాలుగా బురద చెల్లి వివాదాలకు సైతం కేంద్ర బిందువుగా మారుతాడు సదరు అధికారి. ఇతని ముక్కుసుటి విధినిర్వహణ వలన రాష్ట్ర వాక్ఫ్ బోర్డు ఖాజానకు కొన్ని కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. గుంటూరు, క్రిష్ణ, ప్రకాశం, నెల్లూరు ఇలా ఎక్కడ చేసిన ఇతని రూటే సెపరేటు. అయితే ఇతని పై కొంత మంది మోపబడిన ఆరోపణలు సైతం న్యాయ స్థానాల్లో నిరూపణ జరగక కొట్టి వేసిన దాఖలాలు అనేకం ఉన్నాయి.

కోస మెరుపు ఏమిటంటే ప్రకాశం జిల్లాలో ఒక భూ వివాదంపై కేసు పెట్టిన తోటి ఉద్యోగి తిరిగి దానిని నిరూపించలేకపోయారు అంటే విషయం అర్థం అవుతుంది. ఆంధ్రప్రదేశ్ లో సమస్యాత్మక వక్ఫ్ సంస్థలు గాడి తప్పినప్పుడు పై అధికారులకు గుర్తొచ్చే పేరే షేక్ మొహమ్మద్ హుస్సేన్. ఎప్పుడు వచ్చాడు అని కాదు సంస్థ డైరెక్ట్




మానేజ్మెంట్‌లో తీస్కొని ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చేశామా లేదా అన్నది ఇతని నైజం.

ఎవరు చెప్పిన వినడు అన్నా ముద్ర ఎలాగో ఉన్నదే. దానితో పాతో రౌడీ షీటర్ల హెచ్చరికలు, తప్పుడు ఫిర్యాదులతో ఇతని నియామకం ఆపే శత్రు బ్యాచ్లు అనేకం. ఉదాహరణ కు పెదకాకాని బాజీ బాబా దర్గా ఆదాయాన్ని అప్పట్లో భారీగా గండి కొట్టగ కేసులు పెట్టి మరి సదరు ధర్మకర్తలను సస్పెండ్ చేసి దర్గాను వక్ఫ్ అధీనంలో తీసుకున్న తీరు ఒక ఎత్తు కాగా నెల్లూరులో రెండు సంస్థలు అనేక వివాదాలు, కోర్టు కేసులు, రౌడిలా బెదిరింపులు,రాజకీయ నాయకుల వత్తిళ్ళు అయిన వెనకడుగు వేయని ఒక అధికారి ఎవరైనా ఉన్నారు అంటే కేవలం షైక్ మొహమ్మద్ హుస్సేన్ అని చెప్పాలి. ఇతని వ్యవహార శైలితో విసుగు పొంది వక్ఫ్ బోర్డు లోని కొంత మంది అధికారులే ఇతనికి బ్రేక్ వేయడానికి గుంటూరు జిల్లా పెదకాకాని పాతురు ప్రాంతానికి చెందిన ఒక బ్యాచ్‌కు సొమ్ములు ముట్ట చెప్పి మరి ఇతనిపై ఫిర్యాదులు చేయిస్తారు అంటే ఇతని క్రైజ్ ఏ విధంగా ఉంటుందో అర్థం చేస్కోవచ్చు. ఎక్కడ పని చేయవలసి వస్తుందో అని కొంత మంది అమ్మ బచ్చే అంటూ తప్పించుకొని తిరిగే వక్ఫ్ బోర్డులో ఎక్కడ కైన తన డ్యూటీ కు సై అనే ఇతని వ్యవహార శైలి వక్ఫ్ సంస్థ లోని మిగితా అధికారులకు సైతం మేలుకొలుపుగా మారుతుంది.

ఇతను గుంటూరు జిల్లాలో గతంలో పని చేసారు అయితే రాజకీయ నాయకులకు లొంగని కారణంగా రెవెన్యూ కు సరేండర్ చేపించారు అనే ఆరోపణలు లేకపోలేదు. బాజీ బాబా దర్గా పనుల విషయంలో పాతురు బ్యాచ్ ఆరోపణల పై జాయింట్ కలెక్టర్ హోదా గల అధికారులతో త్రి సభ్య కమిటి విచారణ చేసి క్లీన్ చిట్ ఇచ్చిన, ప్రకాశం జిల్లా నిరంభ్యంతర పత్రం విషయంలో మరియు గుంటూరు జిల్లా కలెక్టర్ రెవిన్యూకు సరేండర్ విషయాలలో ప్రభుత్వాన్ని రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం తప్పుబట్టిన ఇంకా ఈ అధికారిపై ఊరు పేరు తెలియని ఫిర్యాదుల పర్వం వస్తూనే ఉంటాయి అంటే ఇతని సమర్థత పై అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైన ఉన్నది. వివాదాలు లేని ప్రభుత్వ సంస్థ ఏది లేదు అందులో ముఖ్యంగా వక్ఫ్ బోర్డు కాకపోతే వక్ఫ్ చట్టాలు క్షుణంగా తెలిసి అమలు చేయడంలో వెనకడుగు వేసే అధికారులు ఎంత మంది ఉన్న ఇటువంటి అతి కొంత మంది అధికారుల వలన మొత్తం సంస్థకే మంచి గుర్తింపు వస్తుంది అని కొంత మంది ముస్లిం మత పెద్దలు, సంఘాలు అభిప్రాయం తెలుపుతున్నాయి. పెదకాకాని బాజీ బాబా దర్గాకు తిరిగి ఇతనిని పర్యవేక్షణ అధికారిగా నియమిస్తారు అన్న అనుమానంతో తమకు వచ్చే అక్రమ కలెక్షన్లు ఎక్కడ ఆగిపోతాయో అని సొంత గూటి పక్షులే ఇతని పై ఫిర్యాదులు చేస్తున్నారు అని దానికి ఉదాహరణగా గతంలో మూడు ఏళ్ళుకు పైగా గుంటూరు జిల్లా వక్ఫ్ ఇనిస్పెక్టర్ మరియు బాజీ బాబా దర్గా పర్యవేక్షణ అధికారిగా పని చేసిన వైసిపి పార్టీ ముఖ్యనేతలు నా బంధు కుటుంబ సభ్యులు అని చెప్పుకొని తిరిగిన ఒక అమ్మ బచ్చే పాత్ర కీలకంగా ఉందని అతను తిరిగి బాజీ బాబా దర్గా పర్యవేక్షణ అధికారిగా రావడానికి కూటమి పార్టీలో కూడా మండల స్థాయి నాయకుల కాళ్ళ వెళ్ళా పట్టుకొని ప్రయత్నలు చేస్తున్నట్టు సమాచారం.

ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసి సేన మైనారిటీ అధ్యక్షులు అసిఫ్ పాషా స్పందిస్తూ కూటమి ప్రభుత్వంలో మైనారిటీ మంత్రి ఫారోక్ ప్రత్యేక దృష్టి సారించి వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ గారి నాయకత్వంలో కొత్తగా నియమింపబడిన వక్ఫ్ బోర్డు షేక్ మొహమ్మద్ హుస్సేన్ లాంటి అధికారులను గుర్తించి వక్ఫ్ చట్టాలను కఠినంగా అమలు చేసే వక్ఫ్ బోర్డు కు తద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలి అని కోరుతూ గుంటూరు, కొండపల్లి, గుడివాడ, భవానీపురం, నున్న లో ఉన్న వక్ఫ్ మరియు ఖాజీ, అంజుమన్ మాన్యాలు ఆస్తులు అక్రమణలకు గురికాకుండా పరి రక్షించి మసీదు కమిటిల ముసుగులో గుడివాడ మసీదు ఆదాయానికి సభ్యులు రూపంలో గండి కొడుతున్న భూ బకాసరుల ఆట కట్ చేసి కొత్త కమిటీలను వేయాలని అదే విధంగా పెదకాకాని బాజీ బాబా దర్గా ధర్మకర్తలపై మోపబడిన ఆరోపణలు కోర్టు కొట్టివేసిన కారణంగా ముజవార్లకు తిరిగి దర్గా హక్కులు వారికీ కల్పించి నిరుపేద ముజవార్ల కుటుంబాలను ఆదుకోవాలని, దర్గా మరియు వక్ఫ్ సంస్థల వద్ద జరుగుతున్నా దొంగతనాలు రౌడీల ఆటలు నియాంత్రించాలి అని మరియు వక్ఫ్ స్ఫూర్తిని కాపాడి మసీదులకు, దర్గా, పీర్ల చావిడి, అంజుమన్, ఈద్గాల అభివృద్ధి మరియు ఆదాయ పరిరక్షణ బాధ్యతలను కఠినంగా అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి అని అసిఫ్ పాషా కోరారు.

# తెలుగు భాషను మరిస్తే అమ్మను మరిచినట్టే



## గైట్ కాలేజీలో తెలుగు మహాసభలలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బత్తుల

## వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారు చాలా వరకు గోదావరి ఇన్స్టిట్యూషన్ నుండి వచ్చిన వారే

## తెలుగు భాషలో ఉన్న మాధుర్యం ఎక్కడా ఉండదు

**కోరుకొండ, జనవరి 9 (ఆంధ్రపత్రిక) :** రాజానగరం మండలంలో గైట్ కాలేజీలో అతిరథ మహారథులతో కలిసి తెలుగు మహాసభలలో ముఖ్య అతిథిగా రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ, రాజానగరం నియోజకవర్గంలో ఎడ్యుకేషన్ మొట్టమొదటి కాలేజీ స్థాపించిన చైతన్యరాజు రాజమండ్రి వచ్చిన కొత్తలో ఈకాలేజీ స్థాపించడం జరిగిందని అన్నారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో మొట్టమొదటి ఇంజనీరింగ్ కాలేజీ, గైట్ కాలేజీ అని పేర్కొన్నారు. వరల్డ్ క్లాస్ ఎడ్యుకేషన్ అందిస్తున్న ఒకే ఒక్క సంస్థ గైట్ కాలేజీ అని ప్రతీ ఒక్కరినీ కూడా ఎన్నో రంగాల్లో ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన చైతన్య రాజుకి ధన్యవాదాలు తెలియజేశారు. దేశ విదేశాల్లో ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో స్థిరపడ్డారని అన్నారు. వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారు చాలా వరకు గోదావరి ఇన్స్టిట్యూషన్ నుండి వచ్చిన వారే అనడంలో ఎటువంటి సందేహం లేదని వివరించారు. ఇంగ్లీష్ లో ప్రపంచ స్థాయి విద్యను అందిస్తున్న గోదావరి ఇన్స్టిట్యూషన్ ప్రపంచ స్థాయి తెలుగు మహాసభలు కార్యక్రమం నిర్వహించడం తెలుగు భాష పట్ల వారికున్న ఇష్టాన్ని, భాద్యతని అలాగే అమ్మ లాంటి మాతృబాష పట్ల ఆయనకున్న ప్రేమను తెలియజేస్తున్నాయని తెలియజేశారు. ఇప్పుడు ఎక్కడ చుసిన విద్యను ఇంగ్లీష్ భాషలో బోధిస్తున్నందున అమ్మ లాంటి తెలుగు భాష మూలలను మర్చిపోకూడదు అనే దృఢ సంకల్పంతో ఈ ప్రపంచస్థాయి తెలుగు మహా సభలు నిర్వహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. గతంలో కూడా ఈసభలను ఘనంగా నిర్వహించారు. ప్రపంచం నలుమూలల స్థిరపడిన ప్రముఖులను ఈకార్యక్రమానికి ఆహ్వానించి వారి సలహాలు, సూచనలు, భాష పట్ల వారి మాటలను మనందరికి తెలియజేయాలని ఈకార్యక్రమాలు నిర్వహించడం చాల గర్వకారణమన్నారు. ఈకార్యక్రమంలో నన్ను భాగస్వామిని చేసినందుకు మరొక్కసారి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని, తెలుగుని నిలబెట్టండి, తెలుగు భాషలో ఉన్న మాధుర్యం ఎక్కడా ఉండదు, అందరం తెలుగులోనే మాట్లాడదాం..తెలుగు భాషను అనుసరిద్దామ్.. మన మనుగడ కోసం ఇంగ్లీష్ లో మాట్లాడదాం, ఇంగ్లీష్ లో పనిచేద్దాం.. తెలుగును మరిస్తే అమ్మను మరిచినట్టే అని భావిస్తూ ఈ అవకాశం ఇచ్చిన అతిరథ మహారథులకు ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# తెలుగు మహాసభలకు నీరుకొండ వీరన్న చౌదరి హాజరు



**కోరుకొండ, జనవరి 9 (ఆంధ్రపత్రిక) :** రాజానగరం గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ నందు జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభ కార్యక్రమం భారతీయ జనతా పార్టీ రాజానగరం నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి పాల్గొన్నారు. జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు అతిథులను ఆహ్వానించారు. ఈసందర్భంగా నీరుకొండ వీరన్న చౌదరి మాట్లాడారు.

# కాంగ్రెస్ పార్టీ ఓబిసి డిపార్ట్మెంట్ నూతన నియమకాలు

**విజయవాడ, జనవరి 9 (ఆంధ్రపత్రిక) :** జనవరి 10వ తారీఖున ఉదయం 10 గంటలకు ఆంధ్ర రత్న భవన్ విజయవాడ నందు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఓబీసీ డిపార్ట్మెంట్ యొక్క జిల్లా చైర్మన్ లను మరియు నియోజకవర్గ చైర్మన్ లను వైస్ చైర్మన్ లను సెక్రెటరీలను నియమించడం జరుగుతుంది ప్రతి గ్రామం లో మండలంలో నియోజకవర్గంలో జిల్లాలో రాష్ట్రమంతా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా చార్మినార్ రెడ్డి గారిని అధికారంలోకి తీసుకువచ్చి అలానే రాహుల్ గాంధీ గారిని ప్రధానమంత్రి చేసే దిశగా నూతన నియమాకాలు నియమించడం జరుగుతున్నాయి కావున కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా ప్రెసిడెంట్లు నియోజకవర్గ కోఆర్డినేటర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాం

## వి పి ఎస్ పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



**విజయవాడ, జనవరి 9 (ఆంధ్రపత్రిక) :** మొగల్రాజపురం వీరమా చనేని సిద్ధార్థ పబ్లిక్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు గురువారం కనుల పండుగగా జరిగాయి. రంగవల్లులు దిద్ది, గొబ్బెమ్మలు, చెరుకు గడలు , బొమ్మల కొలువు పెట్టి, భోగి మంటలువేశారు.చిన్నారులు ఉత్సాహంగా గాలిపటాలు ఎగుర వేశారు.హరిదాసులు కీర్తనలు ,గంగిరెద్దులు హడావిడి,గోదాదేవి కళ్యాణం వంటి పండుగ విశేషాలను ఆయా రకాల వేషధారణలో విద్యార్థులు కన్నులకు కట్టినట్లు చూపించారు.గ్రామీణ వాతావరణం ప్రతిబింబించే విధంగా ఈ వేడుకను నిర్వహించారు. భోగి ,మకర సంక్రాంతి ,కనుమ పండుగ విశేషాలు తెలియజేస్తూ విష్ణు స్తోత్రాలు, గోదాదేవి పాశురాలు, గీతాలు ఆలపించి, నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య ,వైస్ ప్రిన్సిపాల్ రోజ్ మేరీ ,ప్రధాన ఉపాధ్యాయురాలు సిహెచ్ జయలక్ష్మి పాల్గొని చిన్నారులకు భోగి పళ్ళు పోసి, ఆశీర్వదించి పండుగ యొక్క ప్రాధాన్యతను వివరించారు.

# టీడీపీ-జనసేన అధినేతలు సాగిలపడటం దురదృష్టకరం



**విజయవాడ, జనవరి 9 (ఆంధ్రపత్రిక) :** ప్రధాని నరేంద్ర మోదీకి ఏపీలో ఉన్న 25మంది ఎంపీల మద్దతు కావాలి కానీ ఏపీ ప్రయోజనాలు ఏమాత్రం పట్టవన్న సంగతి మరోసారి రుజువైంది. రెండు లక్షల కోట్ల అభివృద్ధి పనులంటూ గొప్పలు చెప్పుకుంటున్నారే గానీ... విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని, ప్లాంట్ మరింత అభివృద్ధి చేస్తామని, మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఆయన మాట వరసకు కూడా చెప్పకపోవడం దారుణం. గత పదేళ్లుగా మోసం చేస్తున్న వ్యక్తికి ఐదుకోట్లమంది ఆంధ్రులు అఖండ మెజారిటీ కట్టబెట్టిన టీడీపీ-జనసేన అధినేతలు సాగిలపడటం దురదృష్టకరం. విశాఖ సభలో విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణపై ప్రధాని ఎటువంటి హామీలు ఇవ్వలేదంటే... అది కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే. మోదీ విశాఖ నగరంలో సభ పెట్టి విశాఖ స్టీల్ ప్లాంట్ ను అమ్మేస్తామని చెప్పి వెళ్లినట్లుగా ఉంది. ప్రధాని తన సుదీర్ఘ ప్రసంగంలో బుధవారం శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల గురించి గొప్పగా చెప్పారే తప్ప...పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రత్యేక హోదా గురించి ఉత్తరాంధ్ర, రాయలసీమ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీల గురించి ప్రధాని మాట్లాడకపోవడం రాష్ట్ర ప్రజలను వంచించడమే. విశాఖ ఉక్కును కాపాడి తీరుతామని ప్రగల్భాలు పలికిన రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఈ వేదిక నుంచి ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ గురించి మోదీకి విన్నపాలు చేశారే తప్ప, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని చెప్పకపోవడం దుర్మార్గం. విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకం రద్దు, సొంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం సమస్యలపై ప్రధానితో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ప్రకటన చేయిస్తారని స్టీల్ ప్లాంట్ కార్మికులు, విశాఖ ప్రజలు ఎదురు చూశారు. వారు ప్రజల ఆశలను వమ్ము చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగేళ్లకుపైగా పట్టుదలగా పోరాడుతున్న విశాఖ ఉక్కు కార్మికులు, వారికి సంఫ్పీభావంగా నిలుస్తున్న రాష్ట్ర ప్రజలు మరింత బలమైన ఉద్యమం సాగిస్తేనే పాలకుల మెడలు వంచడం సాధ్యమవుతుంది. గత పదేళ్లలో ప్రత్యేక హోదా సహా మోదీ నోటి వెంట వచ్చిన ఏ హామీ ఇప్పటికీ పూర్తి కాలేదనే విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసు. ఇటీవల ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ, బీజేపీ, జనసేన లు స్టీల్ ప్లాంట్ ను కాపాడుకుంటామని చెప్పి ఇపుడు మోదీ ముందు మాట్లాడలేక పోవడం దారుణం. మాటల గారడి చేసి పోవడానికి విశాఖ వచ్చి వెళ్లిన మోదీకి సాగిల పడిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పి... రాష్ట్ర ప్రయోజనాలకోసం వెంటనే ఎన్డీఏ కూటమి నుంచి బయటకు రావాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది.

# కోరిన కోర్కెలు తీర్చే ముత్యాలమ్మ

## ఆధ్యాత్మిక సేవకులు ఎస్.ఎస్.ఆర్.ఆంజనేయులు

**దుమ్ముగూడెం (భద్రాచలం) జనవరి 9 (ఆంధ్రపత్రిక) :** వివాహాలు కాని వారు ముత్యాలమ్మ తల్లిని దర్శించిన నెల రోజులలో వివాహాలు జరుగుతాయని ఆధ్యాత్మిక సేవకులు శ్రీ ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు పేర్కొన్నారు. భద్రాచలం నుండి జటాయువు సీతమ్మ తల్లి నార చీరలు ఆర వేసుకున్న ప్రాంతం, పర్ణశాల వెళ్ళే దారిలో దుమ్ముగూడెం మండలం నరసాపురం గ్రామంలో గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయం ఉంది. ఈ తల్లి చాల శక్తి వంతమైన, కోరిన కోర్కెలు తీర్చే ముత్యాలమ్మ తల్లిగా బాగా ప్రాచుర్యం పొందింది. వివాహాలు కాని వారు అక్కడికి వెళ్ళి దర్శనం చేసుకున్న నెల రోజులలో వివాహాలు జరుగుతాయని, మళ్ళీ మీరు అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారని ఆలయ నిర్వాహకులు చెబుతారు. అదేవిధంగా నెల రోజులు వ్యవధిలో తమ పిల్లలకు కళ్యాణాలు జరిగాయని అందుకే తాము మొక్కులు తీర్చుకుంటునట్లు భక్తులు చెప్పారు. స్వయంగా అమ్మవారి ఆలయానికి వెళ్ళి అమ్మవారిని ముట్టుకొని భక్తులు తరిస్తారు. తాము తెచ్చిన చీరె సారె స్వయంగా ముత్యాలమ్మ తల్లికి సమర్పిస్తారు. ప్రతి మంగళవారం ఇక్కడ "అన్నదానం" జరుగుతుంది. పర్ణశాల దర్శించిన భక్తులకు దుమ్ముగూడెం





ముత్యాలమ్మ తల్లి ఆలయంలో మంగళవారం అన్నదానం చేస్తారు. అలాగే ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం (చిన్న అరుణాచలం) నందు "నిత్యాన్న దానం" జరుగుతుంది. ఆధ్యాత్మిక సేవకులు శ్రీ ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు కుటుంబ సభ్యులు భద్రాచలం దర్శించిన తరువాత తరచూ ఈ రెండు దేవాలయాలను దర్శిస్తారు. అన్నదానం కూడా చేస్తారు..

# నేడు రేపు మాగుంట జరుపు పర్యటన కార్యక్రమాలు

ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి 10-01-2025మరియు11-01-2025 తేదీలలో జరుపు పర్యటనా కార్యక్రమము

**10-01-2025**

07.00 సా ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో వుండుట. 07.30 సా - ఒంగోలులో జరుగు స్థానిక కార్యక్రమాలలో పాల్గొనుట. 08.00 సా - ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో వుండుట.

**11-01-2025**

08.00 ఉ- ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో వుండుట. 10.00 ఉ- ఒంగోలులో గుంటూరు రోడ్డులోని ఐటిఐ కాలేజీ ప్రాంగణంలో ప్రకాశం మరియు నెల్లూరు జిల్లాల ముస్లింలు నిర్వహించు ఇస్తిమా కార్యక్రమంలో పాల్గొనుట. 11.00 ఉ - ఒంగోలు ఏ 1 కన్వెన్షన్ లో క్రెడాయ్ ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ నిర్వహించు ప్రాపర్టీ మరియు బిల్డింగ్ మెటీరియల్ షో కార్యక్రమంలో పాల్గొనుట పాల్గొనుట. 02.00 సా - ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో వుండుట. 06.00 సా - ఒంగోలు పట్టణం, చెరువుకొమ్ముపాలెం గ్రామంలోని కాంపస్ లో శ్రీ సరస్వతి విద్యా సంస్థల సిబ్బంది నిర్వహించు 34 వ వార్షికోత్సవ / జల్సా వేడుకలలో పాల్గొనుట.



హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ లో ఏర్పాటు చేసిన అంకుర పరిశ్రమ యు ఆర్ అడ్వాన్స్డ్ థెర్ప్యూటిక్స్ పరిశోధనశాలను గురువారం సందర్శించాను. శారీరిక రుగ్మతలకు మానవ మూల కణాలతో చికిత్స చేసే అధునాతన, మెరుగైన ప్రత్యామ్నాయ విధానాన్ని ఈ అంకుర పరిశ్రమలో అభివృద్ధి చేస్తున్నారని తెలిసి సంతోషించాను. ఎటువంటి దుష్ప్రభావాలు ఉండని మూలకణాల ఆధారిత చికిత్స కు సంబంధించి ఈ సంస్థ పరిశోధనలో కొన్ని విజయాలు సాధించిందని, మేధోహక్కులను పొందిందని తెలిసి సంతోషం అనిపించింది. శరీరంలో రుగ్మతలకు లోనైన వివిధ అవయవాలు, అవయవ భాగాలు పునరుజ్జీవం పొందటానికి మూల కణాలు దోహదం చేస్తాయని పరిశోధనలు ఇప్పటికే రుజువు చేయగా అటువంటి చికిత్స విధానాలను హైదరాబాదులో అభివృద్ధి చేయటం సంతోషకరమైన విషయం. తక్కువ ఖర్చులో మెరుగైన వైద్య చికిత్స అందించే ఇలాంటి పరిశోధనలు భారత్ లో మరిన్ని జరగాలని, యువతరం ఇందుకు ముందుకు రావాలని ఆకాంక్షిస్తున్నాను. యు ఆర్ అడ్వాన్స్డ్ థెర్ప్యూటిక్స్ సీఈవో జగన్మోహన్ రెడ్డికి అభినందనలు.

Printed and Published by KANCHARLA RAMAIAH behalf of Nageswara Rao Estates Private Limited, Printed at jagati publication Limited. Sakshi Press, Survey No 86/10, Madhurawada village, MCV Limits, Visakhapatnam - 530041, (AP), Published at D.No50-39-5/A, NORTH EXTENSION LAYOUT, NEAR STATE BANK OF HYDERABAD, SEETAMMADHARA, VISAKHAPATNAM-530013 Editor:KANCHARLA RAMAIAH.Excutive editor V.VIJAYALAKSHMI. RNI NO.10721/65 CELL 9849998069, Email:andhrapatrikadaily@gmail.com